ప్రబుద్ధాంధ్ర

కలాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము ఏప్రిల్ ౧౯౩౮ { సంచిక ౪

తెనుగుపత్రికల సంపాదకులకు

తొమ్మిదేళ్ల కిందట రాజమహేంద్రవరమునందు ప్రాచీనాంధ్రభాషాభిమానులు కొందరు వర్తమానాంధ్రమును అణచివేయడమునకు ఆయుధాలు ఝళిపించినప్పుడు, ప్రబుద్ధాంధ్ర, సుజనరంజని అడ్డపడి దానికి చాలా సాయము చేసినవి. ఆ పత్రికలు పిమ్మట అంతరించినందున దానికి తగిన పట్టుగొమ్మ లేకపోయినది. ఇప్పుడు ప్రబుద్ధాంధ్ర మళ్లీ పొడచూపడము వర్తమానాంధ్రభాషాభిమానులకు మిక్కిలి సంతోషకరముగా ఉన్నది. ఈ మధ్యకాలమందు అభినవాంధ్రభారతికి ఆశ్రయము లేక తిరుగుతూ ఉండడము చూచి, కనికరించి, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, భారతి, గృహలక్ష్మి మొదలయిన పత్రికల సంపాదకులు కొందరు, ఔదార్యవంతులు, మునుపటికన్న ఎక్కువగా తమ పత్రికలలో, వెలివాడదే అయినా, స్థలమిచ్చి దానిని ఆదరిస్తూవచ్చినారు. అందుకు అభినవాంధ్రభారతీభక్తులు కృతజ్ఞత కలిగి ఉన్నారు, గాని, కొందరు సనాతనధర్మావలంబులు హరిజనులు అంటరానివాళ్లు అని సిద్ధాంతము చేసి తమ భూతదయ ప్రకటించుటకు వీధిలో అరుగుపక్కను వాళ్ళను నిలబెట్టి, తమకు మైల అంటకుండా ఎడముగా ఉండి, వడుగుకాని పిల్లలచేత పట్టెడన్నము వాళ్ల ఒడిలో ఎత్తివేయించినట్టుగా, ఈ పత్రికల సంపాదకులు తమ వ్యాసములుండే గడిలోనికి అభినవాంధ్రభారతిని రానియ్యకపోవడము చూచి. ప్రాచీనాంధ్రభారతిని ఆరాధించడమువల్ల ఎక్కువ పుణ్యము దొరుకుతుందన్న భ్రమ లోకులకు కలుగుతున్నదని చింతిస్తున్నారు. శిష్టులు ఏది ఆచరిస్తున్నారో అదే ఆచరించుటకు ప్రయత్నిస్తారు ఇతరులు కూడాను; సాధ్యాసాధ్యములూ, హితాహితములూ విచారించరు. నన్నయాదుల ప్రాచీనాంధ్రము వ్యవహారభ్రష్టమయినందున, అది నేడు వాడుట ప్రాచీనాంధ్రభాషాపాండిత్యము సంపాదించిన వారికైనా దుష్కరము. ఈకాలమందు పిల్లలకూ, పామరులకూ విద్యలు బోధించుటకు సాధనముగా ఇప్పటి శిష్టవ్యవహారమందున్న భాష వాడవలసినది, పత్రికాసంపాదకులు కూడా అట్లే చేయవలసినది. అందుకు విరుద్ధముగా శిష్టులు ఆదరించడముచేత, దేశభాష వికాసము పొందకుండా సంభాషణకే ఉపచరిస్తున్నది. వాస్తవమైన దేశభాష శిష్టవ్యవహారమందున్నదే. అనాదిగా బ్రహ్మముఖమునుండి వెల్వడి బ్రహ్మ పుట్టించిన మనుష్యుల నోటిలో ప్రవేశించి, ఒక తరమువారి నోటినుండి ఇంకొక తరమువారి నోటిలో చొచ్చి, ఎడతెగకుండా దేశకాలోచితమైన మార్పులు పొంది మన నోటిలో నేడున్న వాగ్దేవి ఒక్కర్తే; రూపము మార్చుకొంటూ ఉంటుంది

ఏ రూపము సాక్షాత్కారము చేసుకోవడము లోకులకందరికీ సాధ్యము?—నేఁడు శిష్టవ్యవహార మందున్నదా? నన్నయాదుల వ్యవహార మందుండేదా?

ప్రబుద్ధాంధ్ర వంటి అభినవాంధ్రభారతీభజన మందిరములు అక్కడక్కడ ఇప్పుడు భక్తులు ప్రతిష్ఠిస్తూ ఉన్నారు. స్వభాషాభిమానమున్నూ స్వదేశాభిమానమున్నూ ఆంధ్రదేశమం దంతటా ఆంధ్రులందరిలో వ్యాపించి నెలకొనుటకు ఈ పత్రికలు చిన్న వయినా అనుకూలసాధనములుగా ఉపచరిస్తున్నవి. అయినా, ప్రతికూల మయిన సంస్థలు ఇంకా ప్రబలముగా ఉన్నవి. ఆంధ్రసాహిత్యపరిషత్తువారు "మాలనిఁ గనుఁగొన్న యుత్తమద్విజుని క్రియను" అభినవాంధ్రభారతి మొగము కనబడితే మొగము ముడుచుకొని సచేలస్నానము చేసి, మైల పోగొట్టుకొంటా రట! అయితే, "ఆ అమ్మవారు సదా వారి నోటను విహరిస్తూ ఉంటుందే! నాలిక తెగ్గోసుకొన్నా వదలదే!" అంటే "నోటికి అంటు లేదు; కంటికే అంటు" అంటారు! సనాతనధర్మ పరాయణులవంటి సనాతనాంధ్రభాషాభిమానులకు ఈ పరిషత్తువారి పత్రిక ప్రధానాశ్రయము, అక్కడ అభినవాంధ్రభారతి సంపర్కమేమీ ఉండదు; మైల పడకుండా అంతా 'మడి' గానే ఉంటుం దట. కాగితము మీదికి ఆంధ్రభారతిని ఆవాహనము చేసి, ఆరాధించడము యజ్ఞకర్మ వంటి దట, అప్పుడు అపశబ్దము వాడరాదట. "బ్రాహ్మణేన న మ్లేచ్ఛితవై నాపభాషితవై, మ్లేచ్ఛోహ వా ఏష యదపశబ్దః" అని పతంజలి అన్నాడు గనుక, నన్నయాదులు ఆరాధించిన ప్రాచీనాంధ్రభారతినే మనమున్ను గాగితముమీద ఆరాధింపవలె నట. వా రారాధించే భారతికి గ్రాంధికాంధ్రభారతి అని పేరు పెట్టినారు, వారి నోట నుండేది "గ్రామ్య" భాషట; అశుద్ధభాషట, అంటరాని దట, చెప్పరాని దట! ఇదీ ఆంధ్రసాహిత్యపరిషత్తువారి సిద్ధాంతము! అభినవాంధ్రభారతీదేవిని ఆరాధించేవారు నరకములో పడతారు గనుక చిన్న బడులలోను, పెద్ద బడులలోను ఎక్కడా, ఎవ్వరూ అభినవాంధ్రభారతిని ఆరాధించకుండా పరిషత్తువారు కట్టుదిట్టములు చేయించి కృతకృత్యులయినారు.

ఇకను, బడులలో పిల్లలచేత చదివించవలసిన పుస్తకములు ఎంచడమునకు గవర్నమెంటు విద్యాశాఖాధికార్లూ, విశ్వవిద్యాలయాధికార్లూ ఏర్పర్చిన పరిషత్తులవా రున్నారు. వారు ఆంధ్రసాహిత్యపరిషత్తువారి మతమునే అవలంబించి, పుస్తకాలలో అభినవాంధ్రభారతి సంపర్కము లేకుండా చేస్తున్నారు.

ఆంధ్రగ్రంథాలయములు అనేకగ్రామములలో ఉన్నవి. వీటిలో కూడా ప్రాచీనాంధ్రభారతినే వ్యవహర్తలు అధికముగా ఆరాధించినా అభినవాంధ్రభారతిని వెలిపెట్ట లేదు, గ్రామదేవతగానో, క్షుద్రదేవతగానో భావించి ఒక మూల ఒక చిన్న గూటిలో ఆమెను ఉంచినారు.

ఇప్పుడు ఆంధ్రభారతిని ఆరాధించే గొప్ప సంస్థలలో గొప్పవి ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, భారతి, గృహలక్ష్మి మొద లయిన ఆంధ్రదినపత్రికలు, ఆంధ్రవారపత్రికలు, ఆంధ్రమాసపత్రికలు. వీటి సంపాదకుల ప్రధానోద్దేశము ఆంధ్రులను అందరినీ ఉద్ధరించడము. బంగాళీవారు, మరాటీవారు, అరవవారు మొద లయిన ఇతరజాతులవారితో సరిసమానముగా ఆంధ్రులు అభివృద్ధి పొందే టట్టు చేయడమే ఈ పత్రికాసంపాదకులకు విహితధర్మము. ఈ ధర్మము సాధించడమునకు పండితపామరసామాన్యమైన శిష్టవ్యవహారస్థభాషలోనే సంపాదకులు తమ వ్యాసములున్ను వ్యాఖ్యలున్ను వ్రాసి ప్రకటించవలెను. ప్రజాస్వామికపరిపాలనము ఏర్పడ్డ దేశములలో, ప్రజల పత్రికలలోని సంపాదకీయవ్యాసములు, ప్రజలతో ముఖాముఖీ మాట్లాడినట్టే సంపాదకులు రచిస్తారు; అట్టి వ్యాసములలో సంపాదకుల భాషాపాండిత్యము ప్రకటించడము హాస్యా

స్పద మనీ, వ్యర్థప్రయాస మనీ, నింద్యమనీ, ప్రఖ్యాతపత్రికాధిపతుల అభిప్రాయము.

ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, రష్యా, తుర్కీ, చీనా, జపాను మొదలయిన దేశములలోని వార్తాపత్రికల సంపాదకులు తమ వాడుక భాషలోనే తమ వ్యాసములు రచిస్తున్నారని ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రికల సంపాదకులకు తెలుసు ననుకొంటాను, తెలిసిన్నీ ఆంధ్రసాహిత్యపరిషత్ పత్రికాసంపాదకుల వలెనే వీరున్ను తమ వాడుకభాషను బహిష్కరించి, వ్యవహారభ్రష్టము లయిన ప్రాచీనాంధ్రశబ్దములు ఎందుకు తమ వ్యాసములలో వాడుతున్నారో నాకు బోధపడదు. ఆంధ్రసాహిత్యపరిషత్తువారు నేటి శిష్టవ్యవహారమందున్న భాష 'గ్రామ్య' మని నిషేధించి, తమ పత్రికలో ఎక్కడా అది కనబడకుండా కట్టుదిట్టములు ఏర్పర్చినారు, వారి సిద్ధాంతమును అనుసరించి వారు ఆచరిస్తున్నారు. ఆంధ్రపత్రికలోను, కృష్ణాపత్రికలోను, "స్వకీయవిలేఖకులు" "ఉపవిలేఖకులు" మొదలయినవారు వ్రాసే వ్యాసములూ, జాబులూ వ్యాఖ్యలూ వార్తలే కాక, కథలున్ను, నాటకములున్ను తరుచుగా వాడుక భాషలో రచించినవి కనబడుతున్నవి గనుక, ఆంధ్రసాహిత్యపరిషత్తువారివలె వీరు వాడుకభాషను, బహిష్కరించినారని అనలేము, వార్తాపత్రికలలో వాడవలసిన "దేశభాష"ను గురించి తమ అభిప్రాయము స్పష్టముగా వీరు ఇదివరకు తెలియజెప్పలేదు, వీరి సంపాదకీయవ్యాసములలోని భాషకున్ను, వీరి "స్వకీయవిలేఖకులు" మొదలయిన వారి జాబులలోని వాడుక భాషకున్ను గల వ్యత్యాసము 'శైలి' లోని భేదమువల్ల ఏర్పడ్డది కాదు; వైదికభాషకున్ను, పాణిన్యాదులు అనుశాసనము చేసిన లౌకికభాషకున్ను గల వ్యత్యాసము వంటిది. మొదటిది ధ్యానదేవుని మారాటీ, చండీదాసు బంగాళీ, నారసింగు గుజరాతీ భాషల వంటిది, రెండవది తంబే మరాటీ, రవీంద్రనాథుని బంగాళీ, గాంధీమహాత్ముని గుజరాతీ భాషల వంటిది. పత్రికాసంపాదకులు ఆంధ్రుల కందరికీ తెలిసేటందుకు గదా తమ అభిప్రాయములు వ్యాసములుగా రచించి పెద్ద అక్షరములతో మొదటి పుటలో మొదటి గడిలో ముద్రించి ప్రకటిస్తారు? ఈ సంపాదకీయవ్యాసములు పత్రికలలో ప్రధానాంగముల వంటివి. వాటి ప్రాభవము వల్లనే పత్రికలకు దేశమందు ప్రఖ్యాతిన్ని, రాజ్యవ్యవహారమందు పలుకుబడిన్ని గౌరవమున్ను కలుగుతవి. పరిపాలకులను గజగజలాడించి, ఒక్కొక్కప్పుడు వారిని స్థానభ్రష్టులుగా చేయగల ప్రభావము ప్రజాస్వామిక పరిపాలనము గల దేశములలో వార్తాపత్రికలకు ఉంటుంది. అట్టి ప్రభావము ఆంధ్రపత్రికలు సంపాదించవలెనంటే, పత్రికాధిపతులు ఎంతటి భాషాపాండిత్యము గలవారయినా తమ పాండిత్యము తమ తోడి పండితులతో గోష్ఠి సలిపినప్పుడే ఉపయోగించవలెను గాని, తమ తోడి పౌరులతో కలిసి వ్యవహరించేటప్పుడు ప్రకటించకూడదు, లోకవ్యవహారము నిర్వహించడమునకు నేడు వాడుకలో ఉన్న సుపరిచితమయిన దేశభాషలోనే పత్రికాసంపాదకులు ప్రజలకు తెలియజెప్పవలసిన విషయము లన్నీ వ్రాయవలెను. దేశోద్ధారకులు సభలలో నోటను చెప్పిన విషయములు చెవులతో వినేవారికి తెలిసినట్లు, ఆ విషయములే సంపాదకీయవ్యాసములలో ప్రకటించినప్పుడు ఆ వ్యాసములు కంటితో చూచి చదివే వారికి గానీ, చదివించి వినేవారికి గాని అవిలంబముగాను, స్పష్టముగాను తెలియవు గదా. అందువల్ల గ్రాంథికాంధ్రములో వ్యాసములు రచించే వారికీ వాటిని చదివే వారికీ వ్యర్థప్రయాసము కలుగుతున్నదని ఒప్పుకోక తప్పదు. సహజమయిన వాగ్రూపముతో నోట నుండి పైకి వచ్చే మనోభావములు ఆరూపముతో ఉన్నప్పుడే అందరికీ సుబోధము అవుతవి. కాగి

తము మీద ఆ భావములు ప్రకటించినప్పుడు లేఖకులు 'గ్రాంథికీకరణము' చేయడముచేత దుర్బోధము లవుతున్నవి. ఆలాగున రచించిన వ్యాసములు చదివేవారున్ను, చదివించి వినేవారున్ను ఎంతో కొంత ప్రయత్నము చేయనిదే వాటి అర్థము తెలుసుకోలేరు. శబ్దమున్ను అర్థమున్ను ఒక దాని నొకటి ఆశ్రయించుకొని ఉంటవి గనుక, సుపరిచిత మైన శబ్దము ద్వారానే అర్థము స్ఫురిస్తుంది. వ్యాసములలో సుపరిచితములు కాని శబ్దము లున్నప్పుడు, వాటి పర్యాయపదములు సుపరిచితము లయినవి చట్టున స్ఫురించకపోతే, చదివేవారికీ వినేవారికీ వాటి అర్థము తెలియదు. ఒకొక్కప్పుడు అపరిచిత మైన శబ్దము ఒక వాక్యమందుంటే, ఆ వాక్యమంతా దుర్బోధ మవుతుంది, అంతే కాదు, దాని మీది వాక్యములకూ, దాని కింది వాక్యములకూ దానితో గల సంబంధము తెలియక వ్యాసకర్త చెప్పదలచుకొన్న విషయము వినే వారికే కాక, చదివే వారికి కూడా బోధపడకపోవడము సంభవిస్తున్నదని నేను బాగా ఎరుగుదును.

సుపరిచిత మైన దేశవ్యవహారము గురించి రచించినది (వ్యాసము గాని, జాబు గాని, పుస్తకము గాని) ఏదయినా దేశస్థులు చదివేటప్పుడు, ప్రత్యక్షరము కూడ బలుకుతూ శబ్దములూ, వాక్యములూ విడివిడిగా చదవరు; ఆలాగున చదవడము చదువు అనిపించుకోదు. చదువు నేర్చిన వారు కాగితము మీది బంతులు కలయజూచి వాక్యములూ వాటి అర్థమూ వాటిలో ఇమిడి ఉన్న మనోభావాలూ కూడా అవిలంబముగా గ్రహిస్తారు. పైకి వినబడేటట్టు చదవడముకన్న తమలో తాము చదువుకోవడము మరీ త్వరితము. (ఇంగ్లీషు నేర్చినవారు మనవారు కూడ కొందరు) ఇంగ్లీషువార్తాపత్రికలు ఎంత సులువుగాను ఎంత శీఘ్రముగాను చదువుతారో చూడండి, అనేక వాక్యములు కలయజూచి అవిలంబముగా అర్థము గ్రహిస్తారు. ఇంగ్లీషునవలలు చదివేటప్పుడు, ఇంగ్లీషువారు (స్త్రీలు గానీ, పురుషులు గానీ) గంటకు నూరేపుటలు చొప్పున పత్రములు తిప్పుతూ ఒక్క ఊపున ఒక్క బిగిని పుస్తకము కడవరకూ చూచి, కింద పడవేస్తారు. వార్తాపత్రికలు కూడా ఆలాగునే ఒకొక్కగడి ఒక్కసారి కలియజూచి ఇంగ్లీషువారు విసిరి పారవేస్తారు. రాజ్యవ్యవహారము నిర్వహించేవారు, వాణిజ్యవ్యాపారాలు చక్కబెట్టేవారు, న్యాయమూర్తులు, పత్రికాసంపాదకులు, పత్రికావిమర్శకులు, శాసననిర్మాతలు మొదలయినవారు ప్రతిదినమూ దినపత్రికలే అనేకము చదవవలసి ఉంటుందే, పండితులూ, పామరులూ (కూలివాళ్లు కూడా) వార్తాపత్రికలు చూడకుండా ఉండరే; అవి సుపరిచిత మయిన వ్యావహారికభాషలో రచితమయి ఉండకుంటే, అట్టి పని సాధ్య మవునా? 'దేశభాష' అనే దానిలో వైవిధ్య మున్నా సంఘములోని శిష్టుల వ్యవహారము దేశస్థులకు సుపరిచితమే; పామరుల కైనా అపరిచితము కాదు. సంఘములో ఒకరు సామాన్య మైన దేశభాష ద్వారా నోటను చెప్పినది మరి ఒకరు చెవితో విని చట్టన గ్రహించినట్టే, కాగితము మీద వ్రాసి తెలియజేసినదికూడా కంటితో చూచి గ్రహిస్తారు. మాతృభాషాభ్యాసము బడులలో చేసిన వారికి అది అలవాటవుతుంది. సామాన్యసంభాషణలో 'నోటిలో మాట నోటిలో ఉండగానే' వాక్యము పూర్తి కాకమునుపే, ఒకరి మనోభావము ఒకరు గ్రహించి, సంభాషణోద్దేశము జనులు నెరవేర్చుకోవడము ఏలాగున సాధ్య మవుతున్నదో ఆలాగునే వార్తాపత్రికలు గానీ, కథలు గానీ, నవలలు గానీ మామూలు జాబులు గానీ ప్రతి శబ్దమూ, ప్రతివాక్యమూ సావధానముగా చూడనక్కర లేకుండానే, చదవడము సాధ్య మవుతుంది కాగితము మీద నున్న దంతా కన్ను కలయజూస్తుంది. మనస్సు దాని భావం గ్రహిస్తుంది. కంటికి గానీ, మనస్సుకు గానీ ఆయాస ముండదు. వాటి పని ప్రయత్నపూర్వకము గాదు

ఇంగ్లీషువారు ఇంగ్లీషువార్తాపత్రికలు చదివినట్టు ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక మొదలయిన వార్తాపత్రికలలోని సంపాదకీయవ్యాసములున్ను, గ్రాంథికాంధ్రమున రచించిన ఇతరవ్యాసములున్ను, జాబులున్ను తెలుగువారు చదవలేరు. ఈ విషయము అనేకసార్లు పరీక్షించి చూచినాను. ఇంగ్లీషు నేర్చిన తెలుగువారయినా ఇంగ్లీషువార్తాపత్రికలు చదివినట్లు సులువుగా తెలుగువార్తాపత్రికలు చదవలేరు. ఇందుకు కారణము తెలుగు అక్షరములు చదవడము వారికి అలవాటు లేకపోవడము కాదు, గ్రాంథికాంధ్రము సుపరిచతము కాకపోవడము.

తెలుగు పత్రికలన్నీ తెలుగుదేశమందున్న తెలుగువారికందరికీ తెలియవలసిన విషయములు తెలియజేసి, వారిని ఉద్ధరించడమునకు పుట్టినవి, గాని పండితులకోసము పుట్టలేదు. పత్రికాసంపాదకులు ప్రాచీనాంధ్రభాషా పాండిత్యము గలవారయినా వారి పాండిత్యము వార్తాపత్రికలలో ప్రకటించడము వ్యర్థప్రయాసము. ప్రజాస్వామికపరిపాలనము ఏర్పడ్డ దేశములలో ప్రఖ్యాతి పొందిన వార్తాపత్రికల సంపాదకులు అట్టి పాండిత్యప్రకటనము వట్టి దంభమని నిందించినారు, వాస్తవమయిన పాండిత్యము తక్కువయిన కొలదీ పండితమానులు వ్రాతలో దంభము అధికముగా ప్రకటిస్తారని ఆక్షేపించినారు. తెలుగువారిలో నూటికి పదిమందైనా సంతకము చేయగలవారు లేనప్పుడు, వార్తాపత్రికలలోని సంపాదకీయవ్యాసములు చదవగలవారు ఎందరుంటారు? పత్రికలలోని వార్తలు వినడమునకు తెలుగుదేశమందు ప్రజలకు అభిలాష ఈ పది యేళ్లలో ఎక్కువయినది. పట్టణములలోనే కాక, పల్లెలలో కూడా పురాణము చదివించి విన్నట్టు ప్రజలు ఆంధ్రపత్రిక చదివించి వినడము నేను స్వయం చూచి సంతోషించినాను. అయితే వారి శ్రమకు అనురూపమయిన ఫలము కలుగలేదు. భాష సుపరిచితము కానప్పుడు ఉత్సాహభంగము అనివార్యము గదా? సంపాదకీయవ్యాసములు పరధ్యానముగా కొందరు వినడము నే నెరుగుదును. కృష్ణ జిల్లాలోని పల్లెటూళ్ళలో కృష్ణాపత్రిక చదవగలవారందరూ చదువుకొంటారనిన్ని, చదవలేనివారు అనేకులు చదివించి వింటారనిన్ని నాకు తెలుసును. కాశీలోను, అలహాబాదులోను హిందీ దినపత్రికలు బజారులో చిల్లరదుకాణదార్లు కూడా కొని చదవడము నేను చూచినాను, అట్లే కలకత్తాలో బంగాళీదినపత్రికలు; లండనులోను, పారిసులోను, న్యూయార్కులోను, బెర్లినులోను, మాస్కోలోను, దినపత్రికల ప్రతులు అనేకలక్షలు ప్రతిదినము చిన్న పిల్లలు వీధులలో అమ్ముతారట! కొన్ని దినపత్రికలు రోజుకు రెండు కూర్పులుగా అచ్చుపడతవట. ప్రజలు గ్రంథాలయాలలోను, విలాసగృహములలోను, పత్రికాపఠనమందిరములలోను, దినపత్రికలు వారపత్రికలు, మాసపత్రికలు ప్రజాసేవ చేసే అనేకసంఘముల వారు ప్రకటించే కరపత్రములూ చదువుకొనేవారికి దమ్మిడీ అయినా ఖర్చు లేకుండా దొరుకుతవి. ప్రజలు చదువుకొనేటందుకు ప్రకటించిన పత్రికలు గాని, కరపత్రములు గాని, పుస్తకములు గాని కేవలవ్యావహారికభాషలోనే రచితమయి ఉంటవి.

తెలుగుదేశమందు గ్రంథాలయములు ప్రజలకు ఉపచరించేటట్టు చేయడమునకు అనేకులు అనేకమయిన ఉపాయములు ఉపదేశించినారు. ఆంధ్రపత్రికాసంపాదకులు ఈ సంవత్సరము జనవరి నెల తేది 22 సంచికలో ప్రధానవ్యాసమందు చేసిన ఉపదేశము నా బుద్ధికి అందరూ కొనియాడదగినదిగా తోచినది. “గ్రంథములు వ్యావహారికభాషలో అనగా మామూలు మాటలలో సులభశైలిని వ్రాయబడవలెను. గ్రంథాలయములలో వార్తాపత్రికలు గూడనుండవలెను. ఈ గ్రంథములను, పత్రికలను ప్రజలు ఉచితముగా బడయగలుగుచుండవలెను. ప్రతిగ్రామమునందును గ్రంథాలయము ప్రజలకు కూడలి స్థా

నముగా నుండవలెను. స్త్రీలును, పురుషులునుగూడ వీటిని పూర్తిగా నుపయోగించుకొనుటకు తగిన సౌకర్యము లుండవలెను. వీటిని ప్రజలు ఉపయోగించుటకు గట్టి ప్రచారము జరుగవలెను. ప్రజల నధికముగా నాకర్షింపగల యేర్పాటు లన్నియును జరుగవలెను.'' ఇది అమూల్య మయిన ఉపదేశము. "గ్రంధములు వ్యావహారిక భాషలో అనగా మామూలు, మాటలలో సులభశైలిని వ్రాయబడవలెను" అనే వాక్యము పెద్దఅక్షరములతో పలకమీద వ్రాయించి, అందరికీ కనబడేటట్టు, ప్రతిగ్రంథాలయము ద్వారము మీదను ఉంచవలసినది.

దేశభాషాభిమానము తోడిదే దేశాభిమానము ఏకులమువారైనా, ఏమతమువారైనా, ఏదర్జావారైనా తెలుగు మాతృభాషగా గలవారందరూ ఒక్క సంఘము వారనిన్ని, సంఘములోని వారందరూ అభివృద్ధి పొందితేనే కాని, సంఘము అభివృద్ధిపొందదనిన్ని, ఎవరు వెనుకబడ్డా సంఘమునకు నష్టమే అనిన్ని, ఎవరు త్రికరణశుద్ధిగా భావిస్తారో వారే దేశాభిమానము గలవారని చెప్పవలెను. వ్యావహారికభాషను పెద్దలు తృణీకరించి, వ్యవహారభ్రష్టమైన భాషను కొనియాడడమువల్ల ప్రజలకు 'దేశభాష' యెడల ఉండవలసిన గౌరవభావమూ, అనురాగమూ, అభిమానమూ కలుగవు. ప్రాచీనాంధ్రము రానివారు వాడుకభాష గ్రామ్య మనుకొని, తమ్ము తామే లాఘవపర్చుకొంటారు. స్వాభిమానము లేనివారికి స్వాతంత్ర్యవాంఛ పుట్టదు; గ్రాంధికాంధ్రము కష్టపడి నేర్చుకొన్నవారూ, ఇంగ్లీషు నేర్చుకొన్నవారూ అవి నేరనివారికన్న తాము గొప్పవారయినట్టు ఈ కాలమందు భావించడము ఎరుగుదుము గదా. ఇట్టి అంతరములు సంఘములో ఉన్నంతకాలము "పౌరసౌఖ్యము" ఏర్పడదు, పౌరసఖ్యము లేనిదే దేశోద్ధారకుల ప్రయత్నములు కొనసాగవు. ఇట్టి అవస్థలో మన సంఘమున్నప్పుడు, ఆంధ్రపత్రికాసంపాదకులు చేసిన హితోపదేశము, మీదను నేను ఉదాహరించినది, పుస్తకాలు రచించే వారే కాక పత్రికాధిపతులు కూడా అవలంబించవలెను. ఆ ఉపదేశము చేసిన ఆంధ్రపత్రికాసంపాదకులే మార్గదర్శకు లయితే, తక్కిన పత్రికలవారికి ఆ ఉపదేశము చొప్పున ఆచరించడము సుకర మవుతుంది. ఏనాడు ఆంధ్రపత్రికలోను కృష్ణాపత్రికలోను సంపాదకీయవ్యాసములు యథోచిత మయిన వ్యావహారికభాషలో రచితమవుతవో, ఆనాడు తెలుగువారికి పండితపామరసామాన్యమైన దేశభాష కలదన్న మాట ప్రస్ఫుటముగా ప్రకటిత మవుతుంది, ప్రజాస్వామిక పరిపాలనము నిర్వహించడమునకు తగినవారుగా తెలుగువారిని తర్బీయత్ చేసే సంస్థలు స్థాపిత మవుతవి. అన్ని విద్యలూ తెలుగువారికి నేర్పడమునకు తెలుగే తగిన సాధన మని అందరూ అంగీకరిస్తారు. అభినవాంధ్రభారతిని ఆంధ్రసారస్వతపీఠము మీద కూర్చుండబెట్టి ఆ దేవికి పట్టాభిషేకము చేసే గౌరవము ఆంధ్రపత్రికాధిపతులు పొందుదురుగాక అని కోరుతున్నాను.

తెలుగు పత్రికలలో ఆంధ్రపత్రిక అగ్రస్థానము పొంది ఉన్నది; తెలుగువారిని ఉద్ధరించడమునకు దీక్ష పట్టినది. పత్రికాధిపతులు నిర్భీకులు; తమకు ఉచిత మని తోచిన మార్గమున నడవగలవారు, ఔదార్యవంతులు, సత్యమేవ జయతి అనే సిద్ధాంతమందు పరమవిశ్వాసము గలవారు. మీద నేను ఉదాహరించిన సంపాదకీయవ్యాసములో వారు చేసిన హితోపదేశము భాషాతత్త్వవేత్తల సిద్ధాంతమునకు అనుగుణముగానే ఉన్నది మన పూర్వుల సంప్రదాయమునకు విరుద్ధము కాదు. (చూ. గద్యచింతామణి). బుద్ధదేవుడు, యేసుక్రీస్తు మొదలగు మహాత్ములు వ్యావహారిక భాషలోనే ప్రజలకు ధర్మము ఉపదేశించవలెనని శిష్యులకు విధించినారు. పండితపామరసామాన్యమైన వ్యావహారికభాష

విద్యాబోధకూ గ్రంథరచనకూ రాజ్యవ్యవహారనిర్వహణమునకూ సాధనముగా ఏ దేశమునందు ఏర్పడినదో ఆదేశమే ఔన్నత్యము పొందిన దని చరిత్ర ఘోషిస్తున్నది. వ్యవహారభ్రష్ట మయిన భాషలను పండితులకు విడిచిపెట్టి, వ్యవహారస్థభాషల ద్వారా లోకవ్యవహార మంతా నిర్వహించడము ఆచార మయినందున, ఇంగ్లాండులో ఇంగ్లీషువారున్ను, ఫ్రాన్సులో ఫ్రెంచివారున్ను ప్రజాస్వామిక పరిపాలనమునకు ముందుగా అర్హు లయినారు. వారి ఆచారమును తక్కిన జాతులవారు అవలంబించి, తెలివితేటలు సంపాదించుకొని వృద్ధి పొంది స్వతంత్రు లవుతున్నారు. మనకాలమందే రష్యాదేశమున ప్రజాస్వామికపరిపాలనము నిర్విఘ్నముగా సాగుటకుగాను ప్రజలకు వాడుక భాషలోనే చదువు నేర్పి, వారు సులువుగా చదివి గ్రహించే టట్టు పుస్తకములూ, పత్రికలూ, ఆ భాషలోనే రచించి ప్రభుత్వమువారు వారికి అందజేస్తున్నారు. ప్రాచీనాచారములు పట్టుకొని పాకులాడే వారిలో మొట్టమొదటివా రని అందరూ చీనాదేశపువారిని మొన్నమొన్నటి వరకూ పేర్కొనేవారు, అట్టి చీనావారు కూడా ఇప్పుడు తమ వాడుకభాష విద్యాబోధకూ గ్రంథరచనకూ తగిన సాధనముగా చేసుకొన్నారు; ఒక్క తరములోనే, మనము చూస్తూ ఉండగానే, నిరక్షరాస్యత చీనాలో నిర్మూలము కావచ్చినది. ఈ విషయమును గురించి ఆంధ్రపత్రికలో శ్రీ. అయ్యదేవర కాళేశ్వరరావుగారు కొంచెము కాలము కిందట నాలు గయిదు వ్యాసములు వ్రాసి ప్రకటించినారు. జపానుదేశము వారి మాట వేరే చెప్పనక్కర లేదు; వారి వాడుక భాషతో కూడా, వారి సామ్రాజ్యమూ, వారి వాణిజ్యమూ, వారి ఐశ్వర్యమూ విజృంభించినవి, అధునాతనప్రపంచమందు జపాను అత్యున్నతి వహించి ఉన్నది.

అయ్యా' ఇంచుమించుగా ఇరవై ఏళ్ళ కిందటను నేనున్ను నా మిత్రుడు శ్రీ. శ్రీ. గురజాడ అప్పారావున్ను వ్యావహారికభాషాభ్యాసము బడులలో నెలకొల్పవలసిన దని వాదించినప్పుడు, రెండుకోట్ల మంది తెలుగువారికి ప్రతినిధులుగా ఈలాగున వాదించడమునకు మా ఇద్దరికీ అధికారము లే దని ఆంధ్రసాహిత్యపరిషత్తువారు హేళన చేస్తూ ఆక్షేపించినారు. ఆ ఆక్షేపమును ఖండిస్తూ దేశములో ఉన్న నిరక్షరాస్యు లందరున్ను, గ్రాంధికాంధ్రభాష రానివా రందరున్ను మా ఇద్దరితో ఏకీభవించిన వారే అని శ్రీవింజమూరి రంగాచార్యులవారు పత్రికలలో వ్రాసినారు. పిమ్మట శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారి నవల 'మాలపల్లె' అనేది విమర్శిస్తూ వాడుకభాషలో గ్రంథాలు రచించవచ్చునా కూడదా అనే కాలముగతించిన దనిన్ని, వాడుకభాషలో వార్తాపత్రికలే ప్రకటితము అవుతున్న వనిన్ని ఆచార్యులవారే తెలియజేసినారు. ఇప్పుడు, వ్యావహారికభాషయొక్క అవశ్యకత, దాని ప్రయోజనము తెలుసుకొని దానియందు అభిమానము, అభినివేశము గలిగి ఉన్న వారు వేలకొలదిగా కనబడుతున్నారు. 'సారస్వతపరిషత్తు' 'కళాపరిషత్తు,' 'సారస్వతసమితి', 'సాహితీసమితి', 'కవిమండలి' మొద లయిన పేళ్ళతో అనేకసంస్థలు దేశమందు వెలసి ఉన్నవి. వీటిలోని సభ్యులు యథోచితముగా అభినవాంధ్రరచన అభ్యసిస్తున్నారు. వారు రచిస్తూ ఉన్న గద్యకావ్యములూ, పద్యకావ్యములూ సహృదయుల మెప్పు పొందక పోవడము లేదు. ఆంధ్రసాహిత్యపరిషత్తువలె ఈ భాషను వెలివేసిన సంస్థ నాకెక్కడనూ కనబడలేదు. ఈపరిషత్తువారు తప్ప తక్కినవా రందరూ వ్యావహారికభాష దేశభాషగా నెలకొనవలసిన దనే అభిప్రాయము కలిగి ఉన్నా రనే నమ్మవచ్చును. ఆంధ్రపత్రికాసంపాదకులను ఉద్దేశించి నేనీ జాబులో చేసిన ప్రార్థన అభినవాంధ్రభాషాభిమానుల మతమునకు విరుద్ధము కాదు. ప్రబుద్ధాంధ్రపత్రిక అభినవాంధ్రభాషాసేవాసదన మనిన్ని, తత్ సంపాదకులు

ప్రధానాచార్యు లనిన్ని భావించి, వారి ద్వారా నా విజ్ఞాపన ఆంధ్రపత్రికా సంపాదకులకు వినయ పూర్వకముగా సమర్పిస్తున్నాను. వారు దానిని అభినవాంధ్రభారతీదేవి లోకహితార్థము పంపిన సందేశముగా భావించి, గౌరవించే టట్టు మా ఆచార్యులు ప్రబోధింతురుగాక !

ఇట్లు అభినవాంధ్రభారతీ దాసానుదాసుడు,
గిడుగు వేంకటరామమూర్తి

పర్లాకిమిడి 6—3—34

(ఆంధ్రపత్రికల సంపాదకు లందరూ యీ సందేశంలో వున్న పరమార్థాన్ని గ్రహించి, తమ రచనలు జనసామాన్యం చక్కగా బోధపరుచుకొని బాగుపడడానికి వాడుక భాషలోనే ప్రకటిస్తా రని నమ్ముతున్నాం. (ప్రబుద్ధాంధ్ర సంపాదకుడు)

?

మల్లాది రామకృష్ణశాస్త్రిగారు

కలా నిజమా? కవుల కల్పనలలోనివా వాస్తవంగా ఈలాటి ఘోరాలు జరుగుతాయా? విధికి అంత ఓర్వలేనితనం ఎందుకో?

* * *

మామూలు కన్న కొంచెం ఆలస్యంగా నిద్ర లేచాడు. బద్ధకం తీరేదాకా పక్క దిగకుండానే రాత్రి మొదలుపెట్టిన నవలను అఖరు చేశాడు: అద్దం దగ్గర నిలుచుని క్రాప్ సరిచేసుకుని తన అందాన్ని చూసి మురుస్తూ...ముసిముసినవ్వుతో చిత్రమూర్తిగా ఉన్నా, నవకాలు చిందిస్తూ ఉన్న హైమ ఫొటోగ్రాఫును చాలాసేపు సాకూతంగా వీక్షించాడు...“ఎన్నాళ్లయింది పెళ్లి—ఎప్పుడు వస్తుందో? ఈ అడుపడుచుల మోరాయింపులకు అంతు ఉండేనా? పుట్టింట్లో విందులు కుడుస్తూ కూరు\ంటే ‘ఇయం గేహే లక్ష్మీ’ అని నమ్మకుని చెప్పి తప్పించుకునే అలసత్వం అంతా ఎక్కడికి పోయింది? ఎగ్జిబిషన్ కోసం వాళ్ల అమ్మ ఏవో కుడుతూంటే తను కూడా అది అయిపోయేదాకా అక్కడే ఉండాలేం?...నడుము వాల్చకుండా రోజూ పొద్దస్తమానమూ కూచుంటున్నా మంటే నా కేమన్నా ఒలికిందా ఇక్కడ?...నా జేబు రుమాళ్లకు పోగులు తీసి అంచులు కుట్టిపెడతా నని ఇక్కడికి ఎన్ని వాయిదా లయినాయి? ప్రైజు వస్తుందిట. నే నున్నాను చాలదూ?...వాళ్ల నాన్న చవుకగా ఐదువందలకి దొరికా నని కొని ఇచ్చాడుకా? అబ్బ ఈ పెళ్లా లన్న వాళ్లు ఎప్పుడూ ఇంతే...”

మెట్లు దిగి వస్తున్నాడు. అంతలో ఆగిపోయి

మెట్లు లెక్కపెట్టుకుంటూ దిక్కులు చూస్తూ తాపీగా దిగే అలవాటు అనిమిషాన మాయమై పోయింది ఒక్క గెంతున ఆమె దగ్గరకు దూకేశాడు వరదరాజు—హైమ అతని ఆవేగాన్ని గమనించి కొంచెం వెనకోలగింది.

"నిజమేనా ?"

"ఏమిటది ?" అని హైమ అమాయికంగా చూస్తూ ఏమీ తెలియని దాని లాగా అడిగింది.

"నిజంగా ! నీవు—నీ వేనా కనబడుతూంది ?"

హైమ నవ్వింది.

"నిద్ర లేవగానే ఎవరి మొగము—నా ముఖమే కాదూ చూసుకుంది ? మంచిదే నన్న మాట—"

"ఇప్పుడేనా నిద్ర లేవడం ?"

"కాదు చాలా సేపయింది," కాని

"ఇంత సేపటి దాకా ఏం చేస్తూన్నారూ మరి క్రిందికి రాకుండా ?"

"కలగంటూన్నాను తమ దర్శనభాగ్యం ఇంత త్వరగా ఈలా తలవని తలపుగా—"

"చాలెండి మరీ నేర్చుకుంటున్నారు..."

"నేర్పడానికి నీవు దగ్గర లేందేనా ?"

"అన్ని ఉత్తరాలు వ్రాయకపోతే మీరు రాలేక పోయినారూ ? సెలవరోజున వస్తే మన ఇద్దరం కలిసి వచ్చేసేవాళ్లం కాదూ ?"

"నేను వస్తే...మరి రాణీగారికి తీరా దయవస్తుందో రాదో—అసలు దర్శనమే కరవౌతుందేమోనని భయపడ్డాను"

"ఈ దలాయింపుల కేం లెండి ? బయలుదేరడానికి బద్ధక మనరాదూ ?"

"పోనీ దయ తలచి నీవే రావా అని—"

"అవును. ఈ మొగవాళ్ల మతమే ఇది. ఎవరి కోసం వస్తుంది అని దిలాసా. పంపించి, తిరిగి మొగమైనా చూడ రమ్మా ఈజాతి లక్షణమే ఇది"

వరద, మారు మాట చెప్పకుండా లోపలికి వెళ్లిపోయినాడు. స్నానాదికములు పూర్తిచేసుకుని వచ్చి హాల్లో కూర్చున్నాడు హైమ వేషం మార్చుకుని సరిగపని చేసిన రాజపుటానా సిల్కు చీర కట్టుకుని వచ్చి అతని సరసను నిలుచున్నది.

"మోహిని లాగా ఉన్నావు "

హైమ చిరునగవుతో అతని ముంగురులు సరి చేస్తూ "నాకు తెలుసు లెండి మీ యెత్తు. అమృత దాన—కాఫీ...కోసం ఇన్నివగలా ?"

కాఫీ కప్పుల్లో పోసింది. అతడు చూసి ఊరుకున్నాడు.

"తాగండి"

వరద, పసిపిల్లవాడి లాగా మారాం చేస్తూ బుంగమూతితో "భోజ్యేషు మాతా..." అని హైమవంక చూసి నవ్వాడు. ప్రేమ వెల్లివిరుస్తూ ఉన్న చూపులతో ఆమె కాఫీ అతని నోటికి అందించింది అవకాశాన్ని పురస్కరించుకుని అతడు హైమను దగ్గరకు లాక్కున్నాడు.

"ఊఁ ఊఁ—ఉండండి—చూడండి మరి, చీరంతా కాఫీ తొణికింది.. ఇంతే మీరు ఎప్పుడూను ."

"పోనిలే. నాకేగా ఫైను ? చెల్లారాం షాపును మళ్లా ఒకమారు తాము పవిత్రం చేయాలిసిన అవసరం కలిగిం దన్న మాట. ధన్యుణ్ణి .."

"ఈమారే, లేత ఊదాలో కొనండి. ఎంబ్రాయిడరీలో చక్కని సన్న అంచులవి వస్తున్నాయి..."

"జోహుకుం"

హైమ అతని బుగ్గలు సాగదీస్తూ "అంత నవ్వుగా ఉందేం ? చెపుతానుండండి మీపని. నాసంగతి అసలు మీరు—"

"మళ్లా దేవిగారు పుట్టింటికి ప్రయాణం—"

"ఆఁ! అదే పని!...మీరు కావాలిస్తే వెళ్లండి... అత్తవారి యింటికి..."

కాఫీ తాగడం అయింది వరద, కుర్చీలోనుంచి లేచాడు. సిగరెట్టు ముట్టించవలె నని అపేక్షపడి, మళ్లా మానివేసి, నిలుచుని, హైమ భుజములమీద

కోపం వస్తే తాళుకోలేను బాబూ! నాకు భయం వేసుకొస్తుంది. నీవు మీవాళ్ల యింటికి ప్రయాణం కట్టావా అంటే—"

హైమ అతన్ని కౌగలించుకుని సిగ్గుతో—విలాసంతో—గాద్గదికంతో—"మిమ్మల్ని...విడిచి ఉండలేన్నా...నేను అడిగినా, మావాళ్ల యింటికి పంపకండి" అని దీనంగా చూసింది.

ఆతడు; "ఆఁ! అంతా నిజమే" అని ఎకసక్కెము చేసినట్లు నటించాడు.

హైమ, చెంపమీద చిన్న జెల్లా యిచ్చి లోపలికి పారిపోయింది. వరద, సూట్ వేసుకుని కారులో కాలేజీకి వెళ్లిపోయినాడు.

*　　　*　　　*

వికసించినవి జాజి
విరులు నీ వేణిలో
ప్రకటించినది వలపు
సుకుమారతినువల్లి...ఇక నేలనే చెలీ!
నన లైతినవి భావ
నానవ్యమాధురిని
నవనవోదయజీవ
నాలసవిలాసాలు......
అళికుమారగీతి
కా లాలితమ్మురై
అలయించినవి మల్లి
కామందహాసాలు...

వెన్నెల లేని లోపం తీర్చడానికి "వెలుగు దీపాలు" తంటాలు పడుతున్నాయి. హైమ, డ్రెసింగ్ టేబిల్ దగ్గర నిలుచుని తలలో పూలదండ సరిజేసుకుంటూన్నది. "మొగవాళ్లు ఎంత కైనా తగుదురు ఎంత నిబ్బరం! నాకోసం ఎంత ఉబలాటపడుతున్నా—తపిస్తూన్నా—ఎదుటపడేటప్పటికి ఎందుకో అంత అభిమానం అదర్జా అనిపించలేక పోయినానుగా ఆయనచేత? నానోటి వెంటే చెప్పించారు. కాని, ఇంటికి రాని, భోజనం అయిన తరువాత వెళ్లొమని పట్టుపడతాను. నాకని తీరా—ఏం—నన్ను విడిచి ఉండలేనని అనకూడదేం?"

చీకటి పడింది బాగా. కారు చప్పుడౌతుందేమో నని హైమ చెవి ఒగ్గి ఏం ధ్వని అయినా వింటూంది. "అబ్బ ఇవాళ కూడా ఆలస్యమేనా! రెండు నెలలకి—ఈరాత్రి ఇం కెంత సేపటికి వస్తారో? ఇదిగో ఈ కొత్త పుస్తకాల దొంతరన్నీ మళ్లా వచ్చిపడ్డాయి. మా అమ్మో! చదవనిస్తా ననుకుంటున్నారు కాబోలు. అన్నీ దాచేయాలి. ఎప్పుడూ చదువేనా?...ఈ సిల్కుషర్టులు ఎప్పుడు కుట్టించుకున్నారో! బాగన్నాయి. ఇవాళ ఇదే తొడుక్కోమంటా. మా నాన్న పెట్టిన పంచలమీదికి ఇవి చాలా చక్కగా ఉంటాయి. ఆ!...ఇదిగో అసలు సంగతే మరచిపోయినానేం? చాలాఁ ఈ సిగరెట్లన్నీని? కాల్చిపొగ నామీదికి ఊదుతారు బాబోయ్!...అవి ఉన్నంతసేపూ నేనైనా కనబడుతానా? సొరుగులో పెట్టి తాళం వేశేస్తా. ఎప్పు డన్నా ముచ్చటగా నే నిచ్చినప్పుడు కాని ఎప్పుడూ అగ్నిహోత్రా లేనా?"

ఇంకా కొంచెం పొద్దు పోయింది. మామూలు వేళ కూడ దాటిపోతూంది...ఁ

"రావాలిసిందేనే ఈపాటికి? ఎక్కడ—ఇంత సేపు ఏం చేస్తున్నారో? అదా సంగతి? పెందరాడే వచ్చేస్తే నాకోసం పరిగెత్తుకని వచ్చారని ఉడికిలిస్తానని—ఎక్కడో తిరుగుతూ ఉండాలి... ఏం? అంత నదురేం? అబ్బ! ఈలాగైతే నేనుండలేను. రేపట్నుంచీ కారు వెళ్లేటప్పుడు నేను కూడా బయలుదేరుతా. అక్కడనుంచి అలాగే షికార్లు కొట్టి ఇంటికి చేరుకోవచ్చును. అంతే ఇకనుంచి అపనే చేయాలి."

ఫోను మ్రోగింది.

హైమ, వినికూడా విసువులో ఊరుకుంది; కాని అవతలవాళ్లు వదిలిపెట్టలేరు. రింగ్ చేస్తూనే ఉన్నారు.

...“ఎవరో బాబూ! వేళకు సరిగా సిద్ధమైనారు. ఎవరన్నా పిలిచారంటే ఈయన ఇల్లూ వాకిలీ వదిలి పరుగెత్తుతారు. ఈవేళే—ఈరాత్రే ఏమంత పని ముంచుకుపోతూందో? నేను పలకను. ఎంతసేపలా పిలుస్తారో చూస్తాను కాదూ?”

ఆగిపోయింది.

‘...అమ్మయ్య!...గండం గడిచింది...—...ఎనిమిది దాటుతూంది. ఇంకా రాలేదేమో? ఈ పాటికి వస్తూండాలి. రాని, పని పట్టిస్తా. మరీ బొత్తిగా భయం లేక చెడిపోతున్నారు. చక్కగా అలంకరించుకుని ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తూంటే తమ చిత్తం వచ్చినప్పుడు దయచేస్తారేం?’

మళ్ళా, ఫోను.

అవతలవాళ్ళను మనసులోనే మ్రింగేసే కోపంతో హైమ రిసీవర్ను అందుకుని పరధ్యానంగా—

‘హలో’, అన్నది.

‘జనరల్—హాస్పిటల్’

‘అహాఁ’

‘డాక్టర్ రామునిమెనన్ మాట్లాడుతూన్నది. ప్రొఫెసర్ వరదరాజాకు’—ప్రాణాపాయ—’

‘ఏమిటి—ఏమిటి—?’

‘కారు ట్రాముతో కొట్టుకున్నది...’

‘ఆఁ! ఆఁ! ఎలా ఉన్నారు. చెప్పండి. ఎలా—ఉన్నా—రు—’

‘స్పృహ లేదు. వారి స్నేహితు—భార్యను రమ్మనండి...’

ఇపుడు మనకు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణం అవసరమా?

భావరాజు వేంకటకృష్ణరావుగారు బి. ఏ. బి. ఎల్.

“ఇపుడు మనకు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణం అవసరమా?” అన్న ప్రశ్న ఆంధ్రుల మనసులో మాటిమాటికీ రేకెత్తుతూ ఒకనాడు గడ్డకట్టిన ఉత్సాహమును నీటికంటె పల్చన చేయుచు ఉన్నది. ఉత్తరసర్కారులవారు ప్రత్యేకాంధ్రరాష్ట్రం నిర్మాణమయితే చాలా లాభాలు ఉన్నాయి అని ఐక్యకంఠంతో ఘోషిస్తు ఉన్నారు. ‘ప్రత్యేకాంధ్రరాష్ట్రం’ ‘మంచిదే,’ ‘కాని’ ‘అయితే’ అంటూ నీళ్లు నములుతూ రాయలసీమాంధ్రులు శంకిస్తున్నారు అనే అనుమానాస్పదమైన మాట మునుపటి సంగతి. ఇపుడు ధైర్యం చిక్కబట్టి మనసులో లేనిపోని అనుమానములు, అసూయలు కల్పించుకొని వైమనస్యంతో ఇపుడు అనావశ్యకం అని చెప్పుతున్నారు ‘అనవసరం” అని నోటితో మొగమోటము విడచి కుండా పోయినా “ఇపుడు మాకు అక్కరలేదు, మీతో మేము కలవజాలము” అని చెప్పడానికి సాహసించి ఉన్నారు. బాగా ఆలోచిస్తే యిదీ ఒక మేలే! అన్నదమ్ములు ఇరువురిలో, ఒకడు నాకది కావలెనంటూ యుంటే, రెండవవాడు ‘అది నాకు పనిలేదు’ అని పెడమొగం పెట్టి కక్షసాధిస్తూ యున్నట్లు భావించడం, ఎంతటి దుస్థితో ఎట్టి కష్టకాలమూ ఉభయులయొక్క శ్రేయస్సు కోరేవారికి ఊహించుకొనడానికి సయితము చాలా దుస్సహంగా ఉంటుంది. ఈ యుభయులకు నిజంగా ఏకీభావమే మనము వాంఛించేటట్లయితే వారిద్దరు మొదట ఏకాభిప్రాయానికి రావాలి. ఉత్తరసర్కారుల ఆంధ్రులు కూడా దత్తమండలవాసులవలె “మాకు అక్కరలేదు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణం” అని నిశ్చయం చేసుకోవాలి. నిష్కల్మషహృదయంతో మనసు మళ్లించుకొని చెప్పాలి;

తమ ఉద్యమానికి స్వస్తి చెప్పాలి. లేదా దత్తమండలవాసులు పరిస్థితులు సమగ్రంగా బోధపరుచుకొని సహృదయతతో ప్రత్యేకాంధ్రరాష్ట్రం మనకు నిశ్చయంగా అవసర మని, పూర్వాంధ్రసీమవాసులతో చేయి చేయి కలిపి దీక్షగా పని చేయాలి.

ప్రస్తుతపరిస్థితు లన్నింటినీ ఆలోచిస్తే యీ సమస్య యింతలో తేమల్పబడుతుం దని తోచదు. అంతేకాదు, ఇపు డున్న పరిస్థితులు ఇంకా కొంతకాలము ఈలాగే ఉంటే ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణం కొన్ని దశల దాకా ఆంధ్రులకు అవసరం కాదేమో అని స్పష్టంగా మనసుకు తట్టుతుంది. ఇపుడాంధ్రభూమిని ఆవరించి ఉన్న సమస్యలు చాలు ఆంధ్రజాతిని వళ్లు తెలియకుండా, కర్తవ్యము తోచకుండా, అన్యకార్యాంతరనిమగ్నను చేసి మృతజీవిగా చేయడానికి, గడియ గడియకు మతి పెడదారిని బట్టి త్రుళ్లింత లాడే యీ విపరీతకాలములో 'ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రనిర్మాణం అవశ్యకమా' ఇపుడు, అన్న ప్రశ్న ఎందుకు కలగవలెనో తెలియకున్నది.

రాయలసీమవాసులకు ఉత్తరసర్కారుల ఆంధ్రులంటే హృదయంలో నిష్కల్మష మైన ప్రేమ లేదు. ప్రేమ వరకు అక్కర లేదు. అసలు మొదట సౌమనస్యమే లేదు. అన్నిటికంటె ముందుగా రాయలసీమవాసుల హృదయక్షేత్రంలో అవిశ్వాసము అసూయ, అనుమానము మొదలయిన విషఅంకురములు మొలకలెత్తి వ్రేళ్లుబారి ప్రాసుకట్టుకొని ఉన్నవి. అన్నదమ్ముల కిద్దరకీ అయిష్టము కుదిరిన తరువాత వేరుపడి యుండుట మంచిది గాని కలిసి యుండుట మేలు గాదు. కలిసి యుండ ప్రయత్నించడం కూడ ఉభయభ్రష్టత్వకారణంగా పరిణమిస్తుంది. దానివలన వారిరువురు శత్రువులకు లోకువ వైపోవుదురు. అంతటితో అది ఆగదు. ఈ పాడు ప్రపంచములో పగ వృద్ధిపొందించువారలే గాని పగ అణగించువారు కానబడరు. మనలో మనకు ఇపు డేర్పడి ఉన్న వైమనస్యము పురస్కరించుకొని మనశత్రువులు కుటుంబకలహం వృద్ధిచేస్తున్నారు. అది అగ్నిజ్వాలవలె సప్తజిహ్వాలతో మింటి కెగసి పోతూ వున్నది. దానిని ఆర్పగల పుణ్యశ్లోకుడు, దక్షుడు ఇంకా పుట్టలేదు. భావికాలం ఎలా ఉంటుందో!

రాయలసీమవాసులపై పూర్వాంధ్రసీమవారికి స్నేహము ప్రేమ ఉన్నదా అని ప్రశ్నను వేయవచ్చును. నిజమైన ప్రేమ కలదో లేదో రాయలసీమవారివలె చేతలయందు కనబరచవలెను గాని నోటి మాటలతో ఎంత నొక్కి చెపుతే నేమున్నది. ఉత్తరసర్కారుల ఆంధ్రులు, 'మాకు రాయలసీమవాసులంటే ప్రేమ గలదు' అని యెంత చెప్పినా నమ్మని దుస్థితిలో రాయలసీమవారున్నప్పుడు ఇవతలవారు గొంతుక చించుకొని ఘోషిస్తే మాత్రం కలిగే మహాప్రయోజన మేమి? గ్రుడ్డివానికి అద్ద మెవడు చూపగలడు? చెవిటివాని చెంత శంఖం పూరిస్తే యేమి ప్రయోజనము?

మొదట ఆంధ్రోద్యమం పూర్వాంధ్రసీమలో ఉద్భవించింది నెల్లూరిమండలవాసులకు ఆంధ్రోద్యమతత్వం తలకెక్కేటప్పటికి మిగిలిన ఉత్తరసర్కారువాసులకు తలప్రాణం తోకకు వచ్చింది. కాని విశ్వప్రయత్నం చేసినా ఆంధ్రోద్యమమూలతత్వము రాయలసీమవాసులకు బోధపడినట్లు లేదు. పాతికేండ్లు తలక్రిందుపడి తపస్సు చేసినా రాయలసీమ సోదరులకు దీని నిజం తలకెక్కించలేకపోయినారంటే తప్పు, తెలివిహీనత చేతకానితనము, అన్నీ ఉత్తరసర్కారుల ఆంధ్రులవే అని అనక తప్పదు. కాని పాషాణ మయినా కరగికరగి చదునవును గాని లోహము, వజ్రసన్నిభము అయిన వస్తువులు చలింపవు. ఉత్తరసర్కారులవారు ఏ యుద్యమం తలపెట్టినా అది ఏదో జిత్తో, పామో, విషమో అని మొదటినుంచి భయ, శంకలతో పరికించి, అడుగడుక్కి అనుమానపడే అలవాటు రాయలసీమవాసులకు పరిపాటి అయింది. ఈ భయము, శంక

అసూయ మొద లయినవి రాయలసీమవారికి చిఱుతప్రాయంనాడే ఉగ్గుపాలతో పెట్టినట్లున్నవి. అవి వారిని వదలిపెట్టేటట్టు కనుపించడం లేదు. ఉత్తరసర్కారుల ఆంధ్రులు ఎంత తన్నుకుచచ్చినా ప్రయోజనం ఉండబోదు అని భయం వేస్తున్నది. చివరకు మన గతి యింతే కాబోలు! ఈ మాట నిస్పృహ చెంది చెప్పేది కాదు సుమండీ. నిశ్చలంగా కూర్చుని నిశ్చలచిత్తములో బుద్ధిని ఏకాగ్రం చేసుకొని నిశితంగా ఆలోచించుకొని తేల్చిన సారాంశ మిది.

భరతఖండంలో ఏ జాతులవారికైనా ప్రత్యేక రాష్ట్రం అవసరము కావచ్చును గాని ఆంధ్రులకు మాత్రం అవసరము కాదని నిస్సంశయముగా చెప్ప సాహసిస్తాను. ఆంధ్రులు దక్షిణాపథ మంతా పాకి ఉన్నారు. అటు పడుమట బొంబాయి రాజధానిలో నున్నారు; ఉత్తరాన మధ్యపరగణాలలో ఉన్నారు. దక్షిణాన అరవదేశంలో ఉన్నారు. మైసూరులో ఉన్నారు. ఇటు త్రిలింగాణములో నున్నారు. అటు రాయసీమలో ఉన్నారు. ఒక ఉత్తరసర్కారుల వారు తప్ప మిగిలిన వారు ఎవ్వరూ ఆంధ్రుల మని అనుకొని గర్విస్తూ యున్నట్లు కనిపించడం లేదు. మధ్యపరగణాలలోని ఆంధ్రు లున్న స్వల్పభాగం ప్రత్యేకాంధ్రరాష్ట్రంలోనికి రావడానికి వీలుంటే ఉండవచ్చును గాని నైజాం ఆంధ్రభాగము మైసూరు ఆంధ్రభాగము మాత్రం రాజాలవు. దక్షిణాదికి పూర్వం వలస బోయి అరవదేశంలో మేము కూడా తెలుగువారము న్నామని చెప్పుకుంటూ ఉన్న ఆంధ్రులు తెలుగు భూమిలోనికి మరల వలస రాజాలరు. ఒక వేళ ఆంధ్రరాష్ట్రం నిర్మాణం కావడమే తటస్థిస్తే ఒక పెద్ద ఖండం అన్యరాజ్యంలోనే ఉండిపోతుంది. ఇప్పటిసంగతి ఆలోచిస్తే ముగ్గురు సోదసులలో ఒకడు దత్తుడైపోయినాడు. ఇంకొకడు బుద్ధిపూర్వకముగా వేరుపడతా నంటాడు. పెద్దవాడు ఇక ఐకమత్యం కలిగి సమిష్టిగా ఉండాలంటే వినే దెవరు? ప్రత్యేకఆంధ్రరాష్ట్రం నిర్మాణం అవడం ఎలాగ?

పూర్వపు ఆంధ్రులు యశోమరంధర శుభశీలురు. వారి సుచరిత్రము తేజస్సు ప్రచండప్రతాపము, ప్రజ్ఞ శక్తిసామర్థ్యములు అభినివేశము. ఉత్సాహము మొదలయినవి బ్రహ్మాండ మంతా నిండి పదిహేనుశతాబ్దములు మహావిభవముతో వెలిగి చివరకు దక్షిణదేశంలో తంజావూరు మధురానగరరాజ్యములలో మిణుకుమిణుకు మంటూ అస్తమించిపోయినవి. ఆంధ్రుల సుగుణసంపత్తిని చూచి ఆశ్చర్యము, భయము సంభ్రమము పొందిన అరవవారు దాక్షిణాత్యులు వాటిని, ఆంధ్రుల వెలుగు చల్లారిన వెంటనే అలవరచుకొన్నారు; ఉత్తీర్ణు లయి అభివృద్ధికి వచ్చినారు. కాని తెలుగువారు తమ జాతియొక్క శక్తి సామర్థ్యములను సుగుణసంపత్తిని పూర్తిగా మరచిపోయి బ్రతికి చెడ్డవారి దుర్గతిలో మునిగియున్నారు. మనము అరవదేశమునకు సంక్రమింపజేసిన సుగుణసంపత్తిని నాగరికతను తెలివితెచ్చుకొని మరల సంపాదించుకోవలయును. అంత వఱకు మనము అరవలతో సంబంధము వదలుకోరాదు. అంత వఱకు మనము వారితో పాటు కలసి చెన్నరాజధానియందే యుండుట శ్రేయస్కరము. సత్సహవాసము విడిచిపెట్టితే మంచి తిలవాట్లు అలవడవు.

పైనవ్రాసిన దానికి రెండుమూడు ఉదాహరణము లిస్తాను. ఆంధ్రులలో అసలు ప్రజ్ఞ కలదా అన్న సంశయము గల వృద్ధమతులకు ప్రత్యుత్తరమిది. జాతీయోద్యమము బంగాలీలు తలపెట్టిన తరువాత ముందు అందు కున్నది ఆంధ్రులు. వంగరాష్ట్రము ఒక్కటిగా నుండవలెను గాని చీలదీయరాదని ఆందోళనము చెలరేగి నపుడు వంగదేశీయులకు సానుభూతి జూపి సాహసముతో చేదోడు వాదోడు అయి దేశాభిమానము ప్రకటించినది ఆంధ్రులు. రాజాంగప్రశకి ఆంధ్రుల రకనాళా

అలో అంతరించిపోయినదని కొందరు మహారాష్ట్రులు దురభిమానముతో అక్కడక్కడ చాటుతూ వచ్చినా చివరకు వారికంటె హోంరూలు ఉద్యమంలో ముందుగా అంజవేసింది ఆంధ్రులు, సహాయనిరాకరణోద్యమము తుపానువలె వీచిననాడు దానిలో మిళితమై చిందులు త్రొక్కినది ఆంధ్రులు. చీరాలపట్టణాన ఆంధ్రుల ఉత్సాహ ప్రభుమంత్రశక్తులు ఎంత పని చేయగలవో ఆనాడు చేసి నిరూపించిన గోపాలకృష్ణయ్య మన ఆంధ్రరత్నము. అతని కృత్యములు భారతీయుల కందరకూ అచ్చెరువు కలిగించినవి. మాంటిఫర్డు రాజ్యాంగసంస్కరణములు అమలులోనికి వచ్చినపుడు తమ రాజనీతిని వెల్లడించి, తమ పూర్వుల ప్రజ్ఞలను తలపునకు దెచ్చుకొని ద్వంద్వప్రభుత్వ విధానాన్ని జయప్రదంగా నడిపిరని చెన్నపురి రాజధానికి అద్వితీయమైన యశస్సు ప్రశంస గడించినది ఆంధ్రులు. రాజ్యాధికారం కైవసం చేసుకున్నప్పుడు దురాశాపరుడై తమకు రొట్టె యితరులకు ముక్క అన్నట్లు అరవజాతివలె చేయక విశాల హృదయంతో ఔదార్యంతో చెన్నరాజధాని నంతా ఒక్క ఉమ్మడిని అభివృద్ధికి తీసుకొని రావడమునకు పూనుకొన్నది ఆంధ్రులు.

ఒక విధంగా ఆనాడే ఆంధ్రుల రేఖ బయలుపడింది. ఆంధ్రులకు ప్రత్యేకవ్యక్తిత్వం ఏర్పడింది. పూర్వం మన ఆంధ్రులను కూడా మద్రాసీలనే అంటూ ఉండేవారు. నేటికీ ఉత్తరహిందూస్థానీలు మద్రాసీ లంటే ఒక విధమైన నైచ్యభావం ప్రకటిస్తారు. ఆంధ్రులు చెన్నరాజధాని దాటి వెళ్లితే ఇప్పటికీ మద్రాసీల కిందనే పరిగణింపబడుతున్నారు. కాని ఆంధ్రులు తమకు ఆత్మవిశ్వాసం కలిగిన నాటనుండి మద్రాసీ అని పిలిపించుకోవడం లేదు. వారు తమ్ము మద్రాసీ అని పిలుస్తే రోషం తెచ్చుకుని స్వాభిమానం పెంచుకొని వినయంగా, గర్వంగా, "మేము మద్రాసీలము కాము ఆంధ్రులము" అని జవాబిస్తున్నారు. ఇట్టి స్వాభిమానం ఏర్పడిన నాడు ఆంధ్రులకు ప్రత్యేకవిశ్వకళాపరిషత్తు స్థాపింపబడింది. చెన్నపట్టణమందున్నటువంటి పెద్ద జనరలుహాస్పిటలు వంటిది దానికి పోటీగా విశాఖపట్నంలో వెలిసింది. దానితో పాటు మేలయిన మెడికలుకాలేజీ యొకటి సంప్రాప్తమయింది. ఇది అంతా ఆంధ్రుల దేశాభిమానం స్వాభిమానం పాలు పొంగినట్లు పొంగడం చేత కలిగిన ఫలము. ఆనాడు ఆంధ్రులలో రాయలసీమ ఉత్తరసర్కారులు అను భేదభావములు ఏర్పడి ఉండలేదు

నేడు కూడా మన చెన్నరాజధానియొక్క రాజ్యాంగమునందు ఆంధ్రునిదే నాయకత్వము. ఆంధ్రులు రాజసము ప్రధానముగా గల శక్తిసంపన్నులు. నాయకత్వము వహించడానికి ఆంధ్రుడే సర్వవిధములా సమర్థుడు. సమర్థతకు తోడుగా ఆంధ్రులకు సచ్చరిత్రము, ఔదార్యము మొదలయినవి ఉంటున్నవి. కాంగ్రెసు రంగమునందు గాని, ఖాది పరిశ్రమాభివృద్ధియందుగాని, హిందీప్రచారణోత్సాహమునందు గాని ఆంధ్రులు ఏమాత్రం కూడా వెనుకబడి ఉండలేదు. కొందరింకా ముందంజ వేస్తున్నారు కొంచెం ముందు అడుగు వేస్తున్నామని అనుకుంటున్నవారితో సమాన మవడానికి కాలు సాచుటకు ప్రయత్నిస్తున్నారు.

కాన ఆంధ్రుల ప్రతిభ, ప్రజ్ఞాసామర్థ్యములు దీక్ష ఇవన్ని బహుముఖములుగా నిష్ప్రయోజనంగా ప్రవహించిపోవడం కంటే యేకముఖమై యేకలక్ష్యంతో కార్యసిద్ధికై వినియోగింపబడడం అన్ని విధముల చేతను కోరదగినది. పూర్వజన్మసంస్కారము ఇంకా ఆంధ్రులకు కలగలేదు. ఆసంస్కారం కలిగిననాడు ఆంధ్రప్రతిభ సానబెట్టిన జాతిరత్నమువలె దేదీప్యమానముగా ప్రకాశిస్తుంది. ఇంకా కొంత అనుభవం కలిగితేగాని ఆంధ్రజాతికి పూర్వజన్మసంస్కారం కలుగదు. ఆంధ్రజాతి తన పూర్వ

పుస్తకములన్నింటిని పూర్తిగా అలవరచుకొనడానికి యింకా కొంతకాలము చెన్నపురిరాజధానియందే యుండడం శ్రేయస్కరము. తనకిపు డేది లోపమో దానిని ఆంధ్రజాతి సంపాదించుకోవలసి యున్నది. ఆంధ్రుల హృదయవిపంచి శిథిల మైపోయి ది. దాని కిపుడు పూర్వపు తీగెలు లేవు. ఇపుడు కట్టుతూ ఉన్న క్రొత్తతీగెలు సయితము కాలోచిత మైన నూతనదివ్యరాగాన్ని ఆలాపించడంలేదు. ఆంధ్రుల సంగీతము అరవదేశములో కాలువిరిగి దిక్కుమాలి కూలిపోయి పడివుంది. ఆ యవ్వకు ఉపశమనం కలుగజేసి, లేవదీసి తారుణ్య మిచ్చి ఆమెను ఆంధ్రదేశానికి మళ్లీతీసుకొనిరావలసిన బాధ్యత ఆంధ్రులయం దున్నది. అరవజాతికి మన సంగీత మలవడ్డది ; గాని అది సుస్వరబద్ధ మైన మధురగానం గాదు, అందు సాహిత్యము సున్న. అది సుందర మైన వట్టి కొయ్యబొమ్మ. కొయ్యబొమ్మలు మెచ్చుకోలేని మన ఆంధ్రజాతి మరల కోమలినే తెచ్చుకోవలయును. త్యాగయ్యగారు పరమపదించి యించుమించుగా నూరు నూటయేభయి యేండ్లయింది. మళ్లీ ఆ పుణ్యమూర్తి తరువాత యిప్పటికీ ఆంధ్రులలో వినతగిన సుస్వరసంయుత మైన మధుర గానము వినిపింప గల దక్షు డెవ్వడూ ఆంధ్రభూమిని ఇంకా జన్మించలేదు. పూర్వచరిత్రకజ్ఞానం పూర్తిగా కలుగకపోవడంచేత ఆంధ్రులు శుష్క మైన అనుకరణాలతో కాళ్లీడ్చుకుంటూ వస్తున్నారు. ఇది అభివృద్ధిని సూచించునది కాదు. ఆంధ్రగాయకులు నేడు పాడివినిపిస్తూ యున్నది శుద్ధకర్ణాటకం గాను, శుద్ధహిందూస్థాని ఖత్తున్ను కాదు. ఇది కొంచెం యిది కొంచెం అవకతవకగా కలిసి రసాభాసపాకంలో కుదిరిన సంకర సంప్రదాయము. శుద్ధమై జాతీయసంప్రదాయసిద్ధమై, మన జాతికి ఉత్తేజ మిచ్చే సంగీతకళను దాక్షిణాత్యులతో కలిసిమెలిసి యుండి గ్రహించి అలవరచుకొని మన దేశానికి తీసుకొని వచ్చి నిలపాలి. దాని కింకా తీరని పని చాలా ఉన్నది దాని మాట అటుంచండి. అంతకంటే దుస్సాధ్య మైన విషమ మైనది ఇంకొకటి ఉన్నది. మన సారస్వతలక్ష్మి—మన నాగరికతాచిహ్నము దిక్కుమాలి తంజావూరునందు మూలబడి కుందుచున్నది. శ్రీరామునికై పరితపించుచు అశోకవనంలో ఉన్న సీతామహాలక్ష్మిలాగ, ఆ ప్రసిద్ధ తంజాపుస్తకభాండాగారమును సేకరించిన పుణ్యశ్లోకుడు, మహామతి, యశఃకాయు డైన రఘునాథభూపాలుడు. చెన్నపట్నం ఆంధ్రరాష్ట్రం ఏర్పడినపుడు అందులోనికి వచ్చినా రాకపోయినా ఆంధ్రుల కంత విచార ముండబోదు. ఎందుకంటె ఆమహాపట్నం కట్టుటకు అంత ప్రసిద్ధికి వచ్చుటకు ఆంధ్రులు తోడ్పడినా, అటువంటి మరియొక పట్నాన్ని, లేదా అంతకంటె ఎక్కువ భాగ్యవంత మైన దాన్ని రమ్యతర మైన దాన్ని యింకొకచోట నిర్మించుకొనడానికి ఆంధ్రులకు శక్తిసామర్థ్యాలు కలవు. అటువంటి మహాపట్నం ఒకటి నిర్మాణం కావడానికి అపుడే ఒకమూల పునాదులు వేయబడినవి. కాని నేటి ఆంధ్రుల నీచదశను, చరిత్రను చూచి విలపిస్తూ శోకమూర్తియై తంజావూరునందు నిలచిపోయిన పుస్తకభాండాగారలక్ష్మిని, మన ఆంధ్రభూపాలు డుత్సాహముతో కూడబెట్టిన దానిని ఆంధ్రులు తమ దేశమునకు తర్లించుకొని రాగలరా? ఈవిషయ మొక్కటి తలుచుకొన్నప్పుడు ఆంధ్రు డన్న వాడి హృదయం ఆవేదనలో కరగి నీరై, కనుకొలకులనుండి స్రవిస్తూ ఉంటుంది. అరవవారు ఆభాండాగారము నంతా మనకు ఈయకున్న యీయకుందురు గాక ; కాని మన ఆంధ్రగ్రంథము లయినా,—పోని వాటికి ప్రతు లయినా వ్రాసుకొనిచ్చి మన దేశానికి తెచ్చుకోనీయకుండ ఆపజాలరు కదా? ఆపని చేయించే భారం మన రాజ్యాంగం నడిపిస్తూ యున్న నాయకు డైన రాజశేఖరుని చేతిలో ఉన్నది. ఇట్టివి మనము చెన్న రాజ

ధానిలోనుండి విడిపోవక పూర్వము సంపాదించుకోవలసినవి ఎన్నో ఉన్నవి. వాటి నన్నింటిని విసుగు పుట్టేటట్లు ఇక్కడ వివరించజాలము. మిగిలినవాటి అన్నిటి కంటె ముఖ్యమైనది మన ఆంధ్రజాతి విస్మరించిన తన పూర్వులయొక్క సచ్చారిత్రము, సుగుణసంపత్తి; వీటిని నిర్వచనం చేయడం అవసరం. బుద్ధిశాలులైన ఆంధ్రులు వాటిని సులభముగా గ్రహింపగలరు. మన పూర్వస్థితిని జ్ఞప్తికి తెచ్చుకొని ఆనాడు మనజాతిని అర్థించిన మహావేశమును నేడు మనము అలవరచుకోవలసియున్నది. కాబట్టి ఆంధ్రులు ఇంకా కొంత కాలము చెన్నపురిరాజధానియందే యుండుట లెస్స అని తోచుచున్నది. ఇంకొక ముఖ్యమయిన పని తీరవలసి యుండగా తొందరపడి యిప్పుడే ఆరవలతో వేరుపడడానికి ప్రయత్నం చేయడం కూడా యెందులకు? ఏం లాభం మనకు వెనువెంటనే ఒలికడానికి సిద్ధమై యున్నట్లు?

ఈపరిస్థితు లన్నీ యిలాగున ఉండగా రాయలసీమవాసులు ఉత్తరసర్కారులవారు ఏంచేసినా, ఏమాట అడినా, ఏం తలపెట్టినా వాటి నన్నింటిని అవిశ్వాసంతోనే, అనుమానంతోనే పరిశీలిస్తున్నారు. ఉత్తరసర్కారులవారి యెడల దత్తమండలవాసులు యింతటి వైమనస్యం పెంచుకొని శంకతో, అసూయతో మెలగుతూ ఉండడం అవశ్యకమా, ధర్మమా అని అనిపిస్తూ ఉంటుంది. దత్తమండలవాసుల చర్యలు గమనిస్తూ ఉన్న పూర్వాంధ్రసీమవాసులకు తీరని సంతాపము కలుగుచున్నది. దత్తమండలవాసుల మనసులో అసూయ, అవిశ్వాసం, మాత్సర్యం పెరుగుచూ ఉన్నన్నాళ్లు, ఉత్తరసర్కారులవారికి వారికి పొత్తు కుదురజాలదు. ఈరెండు కక్షలవారి విధం పరీక్షించినపుడు కురుపాండవుల కథ జ్ఞప్తికి వస్తుంది. రాయలసీమవాసులు మాటిమాటికి ఉత్తరసర్కారులవారు మోసగాండ్రని వంచకులని ఎత్తిపొడుస్తూ ఉంటారు. తమ సోదరుల మోసమును గ్రహించగల దత్తమండలవాసుల అమాయకత్వము నిర్మలచిత్తవృత్తి ఉత్తరసర్కారులవారొకసారి పరీక్ష చేయవలసి ఉంటుంది. తన చిత్తవృత్తిని బట్టి పరుల మనసును నిర్ణయించుకునే అలవాటు అసలు మానవునికి నైజగుణము. తాను లోభి అయితే పొరుగువాడూ లోభియే అని భావించి మాట్లాడుతాడు. తాను దుష్టుడైతే ఎదుటివాడూ దుష్టుడే అని శంకతో భయంతో వాడితో పరిచయం ప్రారంభిస్తాడు. ఉత్తరసర్కారులవారు బెజవాడలో ఉండిన ఆంధ్రవిశ్వకళాపరిషత్తును మోసము చేసి విశాఖపట్నం లాగుకొనిపోయి దత్తమండలవాసులకు తీరని ఒక మహాపకారం చేసినారని ఒకవాదం ఉన్నది. కాని ఆనాడు రాయలసీమనాయకులు చూపిన రాజనీతి, చాకచక్యం మాత్రం సక్రమమైనవి, ధర్మసమ్మతమైనవి కాబోలు. గురువిందగింజవలె రాయలసీమవారు తాము చేసిన తెలివి గ్రహించకున్నారు—పోనియ్యండి దాని కేమి? జరిగిన దేదో జరిగింది. ఇలాగున జరగడం దైవాయత్తమే అని భావించుకొని శాంతి చెందాలి. ఈవిషమసమస్యలో రాయలసీమవాసుల కన్న నిజంగా రాజమహేంద్రవరానికే ఎక్కువ గొప్ప అపకారం జరిగింది. జరిగిపోయిన దానిని గురించి వైషమ్యాలు పెంచుకుంటే పురోభివృద్ధి కలగడం ఏలాగు? చేసినది పొరబాటు అయినా, కాకపోయినా, శాంతికోసం, సంతప్త హృదయంతో ఉత్తరసర్కారులవారు జరిగినది పొరబాటే అని అనుకున్నారు. ఈలాగున జరిగి యుండ కూడ దనుకున్నారు. మళ్లీ రాయలసీమవారిని ఆంధ్రవిశ్వకళాపరిషత్తులోనికి రావలసిన దని స్నేహపూర్వకంగా, మనస్ఫూర్తిగా కోరుతూ పంపిన ఆహ్వానమును రాయలసీమవారు మాత్రం దురాగ్రహంతో నిరాకరించినారు. కారణం అందరికీ తెలిసిందే! కురుపాండవయుద్ధమునకు పూర్వము ఉభయపక్షములవారికి రాయబారం

నడిపిన శ్రీకృష్ణభగవానునివలె పొత్తు కుదుర్చుటకై శాంతికొరకై రాయలసీమవారితో రాధాకృష్ణపండితుడు నీతిసమ్మతముగా నిండు ప్రేమతో రాయబారం నడిపినాడు. కురుపాండవసంతతికి సంఘటిల్లిన వినాశహేతుకర మైన సంక్షోభము మనకు మాత్రం దైవం సంఘటిల్లచేయకుండును గాక! రాధాకృష్ణపండితుని ప్రయత్నము, శ్రీమహాభారతమున రాయబారఘట్టమునందు తొలినాడు విదురునితో సంభాషిస్తూ శ్రీకృష్ణు డన్న మాటలను అప్రయత్నంగా తలపునకు తెస్తూ యున్నది.

'చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు
డడ్డపడి వారితోడఁ గొట్లాడి యైనఁ
దాని యుడుపంగఁ జూరకున్నవాని గ్రూర
కర్ముఁ డని చెప్పుదురు కర్మకోవిదులు.'

కావున ఏవిధంగా నైనా యీరెండు పక్షముల వారికి శాంతి సమకూర్చుతా నని విశ్వప్రయత్నం చేసిన సర్ రాధాకృష్ణపండితు డంతవాని ధర్మార్థసహితము లైన మాటలు అనుమానగ్రస్తు లయిన దత్తమండలవాసులకు హితవు కాకపోయెను. ఆంధ్రవిశ్వకళాపరిషత్కులపతి జగద్విఖ్యాతయశోమూర్తి, శుభ్రచంద్రుడు, పండితుడు విశేషించి చిత్తూరుమండలవాసి అగు డాక్టర్ సర్ రాధాకృష్ణమహాశయు నంతటివానిని ఉత్తరసర్కారులవాడని, పక్షపాతంతో చెబుతున్నా డని శంకించి తమకు హిత మైన దానిని, వంచన లేక చెప్పిన దానిని, దత్తమండలవాసులు వినకపోయారు. మీదు మిక్కిలి వంచకు లని ఉత్తరసర్కారులవారిని నిందపాలు చేస్తున్నారు. హేమకేదారఖండములు దేవమాతృకలు గల పావన మైన భాగ్యభూమి యీ పూర్వాంధ్రదేశభాగము. జీవవాహిను లయిన మహానదులు ప్రవహించి యీమహాంధ్రభాగమును సర్వసమగ్రసస్యాఢ్యనుగా చేస్తూ ఉన్నవి. శ్రమ పెట్టకయే అడిగిన మాత్రాన ఫలము సమృద్ధిగా నొసగే జనని దివ్యభూమి యిది. ఇట్టి మెత్తని మట్టిపై పుట్టి పెరిగిన పూర్వాంధ్రసీమల ప్రజలు జన్మభూమివలె మెత్తని మనసు గలవారు, ఉదారహృదయులు, ఉత్సాహవంతులు, కల్లకపటము లెరుగనివారు. వంచన సేయుటకు ఒల్లనివారు. అధర్మప్రవృద్ధి, దుశ్చరిత్రము, దుష్టప్రవర్తనము వారు త్రాగే పుణ్యనదీఅమృతతోయము లందే లేవు. వారు పీల్చు గాలియందే కానబడవు. రాయలసీమాంధ్రులవలె వారు కర్కశ మైన పాషాణభూముల యందు పుట్టి పెరిగినవారు గారు. బోడికొండల నడుమన నిస్సారము లయిన లోయప్రాంతములలో నీటిచుక్కలు నిలువని ఎఱ్ఱమట్టి నేలపై పుట్టి పెరిగిన రాయలసీమవారికి తమ జనని మాతృభూమి యందే విశ్వాసము లేదు. రక్తమాంసములు ధారవోసిన గాని ఆభూదేవి జీవనాధారం చూపించదు. పోనీ అనుకున్న దానిలో సగం ఫలమైనా ఒసగదు. అట్టి గట్టి నేలపై ఊసరక్షేత్రములపై పుట్టి పెరిగిన దత్తమండలవాసుల మానసములు పాషాణసన్నిభము లయి శంకతో, అసూయతో, మాత్సర్యముతో, వక్రబుద్ధితో నిండియుంటవి. అందులో ఆశ్చర్యం ఏ మున్నది? వారు తమ విపరీతచిత్తవృత్తిని బట్టే యితరుల చిత్తవృత్తిని నిర్ణయించుకొంటారు. తాము వ్యవసాయం చేసే జన్మభూమినే రాయలసీమవాసులు విశ్వసించనపుడు ఉత్తరసర్కారులలో ఉన్న తమ ఆంధ్రసోదరులను ఏలాగున విశ్వసించగలరు? ఈవిషప్రవృత్తి దత్తమండలవాసులకు నైజగుణము. ఇది వారు త్రాగే నాపరాళ్లు, పలకరాళ్లపై ప్రవహించే నీటియందే యున్నది. పీల్చే గాలియందే యున్నది.

పూజ్యు డైన సర్ రాధాకృష్ణుని హితవాక్యములను బ్రతుకు తెరువు ఎరుగని దత్తమండలాంధ్రులు గ్రహించలేకపోయినారు. అంతటితో ఊరుకోలేక తాము ఆంధ్రవిశ్వకళాపరిషత్తులో మరల కలియ రాకపోతే ఉత్తరసర్కారులతో పొత్తు గూడకపోతే పూర్వాంధ్రసీమవాసులకు, ఆంధ్ర

విశ్వకళాపరిషత్తునకు, ఏదో ఒక మహోపకారం సంభవిస్తుం దని, ఒక లోటు కలుగుతుం దని యెంతో భ్రమపడ్డారు. ఇది ప్రత్యేకాంధ్రరాష్ట్రం నిర్మాణం కావడమునకు ఎత్తిన పన్నాగ మని శంకించారు. ప్రత్యేకాంధ్రరాష్ట్రం ఉత్తరసర్కారుల వారికి ఒక్కరికే మేలు కూర్చదు. ఆంధ్రు లన్నవా రందరికీ లాభకారి అవుతుంది. అయినా ఉత్తరసర్కారులవారికి ఏదో నష్టం సంభవింపగల దని పేరాసక్తితో రాయలసీమవాసులు, సర్కారుల వారితో పొత్తు వాంఛింప మని నిరాకరించి తా మేదో ఒక ఘనకార్యం జరిగించా మని తెలివి తక్కువ గర్వంతో పొంగిపోతూ ఉన్నారు. తమ కృత్యంలో ఎంత తెలివిహీనత కలదో యోచించుకోలేకుండా ఉన్నారు. దత్తమండలములు ఆంధ్ర విశ్వకళాపరిషత్తులోనికి వస్తే కలిగే లాభాలు వారు గ్రహించుకోలేకపోయారు. ఈ విశ్వవిద్యాలయం వల్ల కలిగే భాగ్యం అన్నదమ్ములు ఇరువురు సమంగా పంచుకొని అనుభవించవచ్చునని తలచి స్నేహముతో, సద్భావముతో, ధార్మికబుద్ధితో ఆవిశ్వకళాపరిషత్తువారు దత్తమండలము వారిని పిలుప నంపించారు; గాని మరియొక దురుద్దేశముతో కాదు. రంధ్రాన్వేషణమే పరమార్థముగా నెంచుకొని అసూయాగ్రస్తు లయిన దత్తమండలనాయకులు లేని పోని శంకలలో బడి వ్యాకులత నొందుతున్నారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారు తిరుపతి దేవస్థానం నుంచి వచ్చే ఆదాయానికి దురాశపడడం లేదు. ఆ ఆంధ్రదేవుని సొమ్మునకు ఆంధ్రు లందరు హక్కుదారులే ఆమాటకు వస్తే. అది ఒక్క దత్తమండలములవారిది మాత్రం కాదు. తిరుపతిలో విశ్వవిద్యాలయం వస్తే రావచ్చును. దానిని రాయలసీమవారే అనుభవించవచ్చును. దానికి ఉత్తరసర్కారుల వారు అడ్డుపెట్టరు, కాని తమ కొణాచి నంతా అపహరించుటకు ఉత్తరసర్కారులవారు పన్నిన పన్నాగ మని ఆలోచించే దత్తమండలముల వారి కుట్ర యింతవఱకు ఉన్న దని ఉత్తర సర్కారులవారు గ్రహించలేకపోయినారు. దత్తమండలముల వారి చిత్తవృత్తి యెట్లున్నా ముందుముందు తిరుమలవిశ్వకళాపరిషత్తు ఏర్పడినా ఏర్పడకపోయినా, సుహృద్భావముతోనే ప్రేమతోనే దత్తమండలముల వారిని ఆంధ్రవిశ్వకళాపరిషత్తులోనికి రావలసిన దని పిలువనంపారు. కాని రాయలసీమవారు "మీతోడి పొత్తు మాకు అవసరము లేదు. మేము మీదరికి రాము" అనడం చూస్తే "శ్రీ రా మోకాలొడ్డిన వారి విధాన" ఉన్నది. తిరుపతి వేంకటేశ్వరుని సొమ్ము లేక పోయినా ఆదేవుని దివ్యానుగ్రహంవల్ల ఆంధ్రవిశ్వకళాపరిషత్తు భాగ్యవంతురాలై, కులపతి, పుణ్యశ్లోకుడు అగు సర్ రాధాకృష్ణపండితుని చేతులలో అల్లారు ముద్దుగా పెరుగుతూ ఉన్నది. దినదినాభివృద్ధి గాంచుతూ ఉన్నది. ఇప్పుడు దాని కున్న లోపము లేదు. దాని ప్రసిద్ధి యితరవిశ్వవిద్యాలయముల దీటునకు ఏమాత్రం తీసిపోదు. కొన్ని సందర్భములలో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఇతర ప్రాంతముల వాటికంటె ముందంజ వేస్తూ ఉన్నది. ఇంతటి గొప్ప సంస్థయొక్క భాగధేయము దత్తమండలములవారికి వెక్కస మైతే కానిందు పూర్వాంధ్రసీమజనులే అనుభవించెదరు. ఉత్తర సర్కారుల వారితోపాటు మీరుకూడా యీ మహాభాగ్యమును వీరికి పంచి యిమ్మనమని రాయలసీమవారికి రాయబార మంపలేదు. దత్తమండల వాసుల బెదరింపులు విని పూర్వాంధ్రసీమ ప్రజలు తమ భవిష్యత్తును గురించి శంకింప నగత్యం లేదు. ఏనాడు రాయలసీమవారు పశ్చాత్తప్తులయి తమకు కూడా ఆంధ్రవిశ్వకళాపరిషత్తే ఏడుగడ యని తెలుసుకొని, ఉత్తరసర్కారులవారితోడి పొత్తును ఆశ్రయిస్తారో ఆనాడే వారికి స్వాగతం ఇచ్చి ఆదరంతో, స్నేహపురస్సరంగా ఉత్తరసర్కారుల వారు తమ భాగధేయమును పంచి యిస్తారు. అనా

డే రాగలదు ప్రత్యేకాంధ్రరాష్ట్రము. అంతవఱకు ఆతురత పడ నక్కర లేదు. అంతవఱకు రాయల సీమవారి మాట తలపెట్టకుండా ఊరకుని కాలచక్రము చూపించు చిత్రాలు తిలకిస్తూ పూర్వాంధ్రసీమల ప్రజ లుంటారు. తమ్ముల రాకకై ఎదుళ్లు చూస్తూ ఆదరముతో హృదయద్వారం ఎప్పటికీ తెరచి ఉంచగలరు పూర్వాంధ్రసీమలవారు.

ఇన్ని చెప్పిన తరువాత, ఇంకో విషయం కూడా చెప్పక తప్పదు. ఉత్తరసర్కారుల వారు కూడా కొన్ని విషయములందు ధర్మం తప్పి నడుస్తున్నారు. అది ఒప్పుకొని సిగ్గుపడాలి ఇట్టి అధర్మప్రవృత్తి యెంతకాలం దాకా మనవాళ్లని పట్టుకొని పిశాచంలాగున ఏడిపిస్తూ ఉంటుందో అంతవఱకు ఆంధ్రులకు ఏమీ మోక్షం లేదు. ప్రత్యేకాంధ్రరాష్ట్రం కావాలని పెద్ద గొంతుకతో ఘోషించే పూర్వాంధ్రసీముల వారికి గంజాం విశాఖపట్నం మండల వాసుల ఘోష చెవి సోకకుండా ఉండడం చాల దుఃఖకర మైన విషయము. సుమారు నూటికి అరవై, డెబ్బయి పాళ్లు తెలుగువారు ఎక్కువగా ఉన్న ఆంధ్రసీమలను అన్యాయంగా ఒఢ్రజమీందారులు పట్టుపట్టి తమ నూతనఒరిస్సారాష్ట్రంలోనికి బలవంతంగా ఈడ్చుకొనిపోవను కిస్తూంటే దానిని ప్రతిఘటించడానికి గంజాంమండల ఆంధ్రులు చేస్తూ ఉన్న ఆందోళనకు మాటవరుస కైనా చేయూత, సహాయ్యమూ చేయకుండా తమ సంగతి కా దన్నట్లు ఊరుకున్నారు గోదావరీ, కృష్ణా, గుంటూరు నెల్లూరు జిల్లాలలోని ఆంధ్రనాయకులు—. ఈ ఆంధ్రదేశంలో పౌరుషము శౌర్యశూరత్వము, చచ్చి జీర్ణ మైపోయినవా? తోటి ఆంధ్రుడి కష్టము తనదిగా భావించని యీ గోదావరి, కృష్ణా గుంటూరు నెల్లూరు ఆంధ్రుల ఆంధ్రోద్యమ ఉబలాటము నిజముగా వ్రేళ్లుబారి యున్నదా, లేక పైపైనుంచి యెగిరిపోవు గాలిదుమారము వంటిదా? నిజంగా యీ ఆంధ్రోద్యమము నిర్మల మైనది, జను లందరూ ఏకగ్రీవంగా వాంఛించేది అయిన ట్లయితే గంజాం విశాఖపట్టణమండలములవారి ఆంధ్రోద్యమమునకు యితరజిల్లాల వారు సహాయకారులు కావలసినదే. కాని యీ బూటకపు దేశాభిమానంతో ఉప్పొంగిపోయే ఆంధ్రుడికి—కాంగ్రెసు వెల్లువలో మునిగిపోయిన ఆంధ్రుడికి నిజ మైన దేశాభిమానం లేదు. అది కలిగేవఱకు ప్రత్యేకాంధ్రరాష్ట్రం రాజాలదు. నిజ మైన దేశాభిమానం కలగడానికి యింకా ఆంధ్రులు చెన్నపురిరాజధానిలోనే ఉండి కొన్ని క్రొత్తసంగతులు మంచి విషయములు నేర్చుకోవాలి, అవలంబించాలి.

విరాగి

కోలూరు ధర్మారావుకవిగారు బి. ఏ

కాని రైలు నిమిత్తమై పోయే నా నడకకు ఒకటే తొందర. కీ యివ్వడం మరచిపోయిన రిస్టువాచీతో పాటు కాలమే స్తంభించిపోయిన ట్లుంది. టైము తెలియకుండా వుంది. అయిదున్నర కాకుండా స్టేషను చేరాలి.

కొంత సేపటికి దూరదేశంలో ఆప్తబంధువుల్లాగు రైలుపట్టాలు కనపడ్డవి. కొంత మనస్సు కుదుటబడ్డది. ఇకను వాటిబట్టి నడచిపోతే స్టేషను సుఖవుగా చేరొచ్చు. దట్టంగా ఆవరించి వున్న మంచులో ఒకటే నూటిగా కనుచూపుమేరకు బారుల్లా దూసుకుపోతున్నాయి రైలుపట్టాలు. ఎంత నడచినా నడక తరుగన ట్లుంది. దూరముగా రక్తపు చుక్క యెదుట కనపడగానే, స్టేషను సిగ్నలుకదా అని ధైర్యం తోచింది. మరి పావుగంటకు స్టేషను చేరుకున్నాను. దీపం లేదు. నిర్మానుష్యంగా వుంది. టిక్కెట్ల కిటికీ కూడా మూసివేయబడి వుంది. లోపల యెలుక కొరుకుతూన్నట్టు డెమ్మీ చప్పుడును, ఒక మనిషి గుర్రుకు తప్ప మరేమీ శబ్దం లేదు. చేతి నున్న "ఆంధ్రరత్న" ఖద్దరు సంచి తలక్రింద పెట్టుగుని కన్ను మూతా మని బెంచీకోసం నాలుగువంకలా పరికిస్తూంటే ఒక మూలనుంచి,

"ఏవూరు ?"

"మాది విజయనగరం."

సిగరెట్టు అలవాటు లేని లోపం యీ నాటికి కనిపించింది. గుడ్డి గుడ్డి వెలుగు. ఈ చీకటిలో, నిశ్శబ్దంలో నన్ను ప్రశ్నించిన కంఠధ్వని యెవరో అని నిదానించి చూసేను.

సుమారు నలభై అయిదే ళ్లుంటాయి. సన్యాసి ముఖవర్చస్సులో బ్రహ్మతేజం పొలుకుతూంది. అంతవిశాలవక్షంలో వున్న హృదయం కష్టసుఖాలన్నిటికీ యెలాగు కరడుగట్టిందో అనిపించింది.

"స్వామీ! తమ రెక్కడనుంచి వస్తున్నారు?"

"రాయపురంలో యెక్కేను, ఈ ప్రాంతంలో దిగిపోయేను. ఇక్కడనుంచి మీవూరే వస్తున్నాను. అక్కడ పాలగుమ్మవారిల్లు మీ కెరుగుదురా?"

"కస్బాలోనా?"

"కాదు. మహారాణీపేటలో."

"తెలియదు."

గణగణ మని గంట మోగింది, రైలు సై టయినట్లు. గూడు కిటికీ తలుపులు తెరిచి, మాయిద్దరి మొగాల్నీ రెండు టిక్కెట్లు కొట్టి బుకింగుగుమాస్తా మళ్ళీ తలుపులు మూసేసేడు, కళ్లు నులుముకుంటూ.

* * * *

రైలులో యేకదొమ్మి. ఇంత కుమ్ముకుంటూనైనా ప్రయాణం చెయ్యవలసిన అగత్యం యీ బండిలో ప్రతి మనిషికీ వుంది కాబోలు...ఈసన్యాసి పూర్వాశ్రమం యేమిటో...యేం మాట్లాడుదా మన్నా, కొండ పిండి చేస్తూన్నంత రొద యీ రైలు.

"ఆర్యులారెయ్, మన దేశంలో అనేకమంది," అంటూ ఒక మీసాలవా డుపన్యాసం యెత్తుకున్నాడు. అన్ని జాడ్యాలూ కుదిర్చే ఘుటిక అసలు వెల అణా అయినప్పటికీ మాబండిలో కూర్చున్న వాళ్ల మీద వున్న ప్రత్యేకాభిమానం కొద్దీ ఒక పైసాకే యివ్వడాని కేర్పాటు చేసేడు. పిల్లలు లేని ఒక యిల్లాలు "పూచీ పడితే కావా" లని చెప్పి ఒక గుటిక పుచ్చుకుని పైటచెంగున కట్టుకుంది. ఓ ముసలమ్మ బుగ్గమీద వేలుంచుకొని "యేపుట్టలో యేపామో" అంటూ తల పంకించినది.

* * * *

"స్వామీ, మీరు మాగృహపావనం, చెయ్యాలి యీపూట" అని రైలు దిగుతూనే సన్యాసిని ఆహ్వానించేను. ఒక మూల జట్కావాడు, నాచేతులో సంచి బలవంతంగా లాగేస్తూన్నాడు.

"అయ్యా. ఈ రైలు చుట్టరికాలు మీరు పాటించినందుకు సంతోషం. నాతో మీరు పాలగుమ్మవారింటికి మాత్రం రావాలి."

"అవశ్యం"

జట్కా మా యింటివద్ద ఆగేం. సన్యాసి కళ్లల్లో పూర్వాశ్రమస్మృతులు ద్యోతకమైన ట్లయింది.

"ఈ యిల్లేనా మీది?"

"ఊఁ."

"జగన్నాథాని కేమవుతారు మీరూ?"

"మా నాన్నగారే."

"వారిని చూడాలి వకసారి. ఆయనా నేనూ బాల్యస్నేహితులం."

"వారు గతించి ఆరేళ్లయింది!"

సన్యాసి ముఖం వెలవెలబోయింది.

"ఈ తీసెమీద కూర్చోవచ్చునా?"

"లోపలికి దయచెయ్యండి."

"చిన్ననాటి మాతీసె."

నాకు మరి ఉండబట్టింది కాదు.

"స్వామీ, తమ పూర్వాశ్రమవృత్తాంతం..."

సన్యాసికి నాతనుపే లేదు. ఒక పావుగంట తీసెమీద నిలువుగన్నులతో బయలు పరికిస్తూ కూచున్నాడు.

"సరే. వస్తారా మా...పాలగుమ్మవారింటికి కెడదాం!"

* * * *

"అమ్మా!"

"ఎవరూ!" అని పెరట్లోంచి కాబోలు.

"ఒకసారి తలుపు తీస్తారా?

నేనూ సన్యాసీ బైట పడిమినిట్లు నిల్చున్నాం. సుమారిరవై యేళ్ల అమ్మాయి వచ్చి తలుపు తీసింది. సావిట్లో చాప వేసి "కూర్చోండి" అంది.

ఎందుకు వచ్చేమో నాకు తెలీదు. సన్యాసి చతికిలపడ్డాడు. అమ్మాయి నిశ్చేష్టపోయి అర్థం కానట్లు చూస్తూంది. సన్యాసి మాట్లాడడం ఆరంభించేసరికి నాకు వాక బైటింది.

"ఈ యిల్లు మీస్వంతమేనా?"

"మాదే. అంటే మాపుట్టిల్లిది. ఇక్కడనే వుంటున్నాం."

"పాలగుమ్మవారి పిల్లవమ్మా?"

"అవును."

"మీ....." సన్యాసి గుటక లేసేడు. ఆ అమ్మాయి మీద లగ్నమై వున్న కళ్లు వీధివేపు తిప్పుకొని, దండపీఠం మీద ఆనుకున్న బుజం చాటునకు మొగం వంచి,

"మీ తలిదండ్రులు లిక్కడే వున్నారా?"

"మాఅమ్మ నేపుట్టగానే పురుట్లోనే పోయింది. మానాన్న అప్పుడు బొంబాయిలో వుండేవారట; ఆయన మరి దేశం రాకుండానే హరిద్వారం వెళిపోయేరుట. నాలుగేళ్ల కిందట మాపెద్దతగారు కాశీనుంచి వచ్చి ఆయన కూడా గతించినట్లు చెప్పేరు. మా మామయ్యే నాకు పెళ్లి జేసేడు."

సన్యాసి కళ్లు రెండు నడబావు లయేయి. గిర్రున నీళ్లు తిరిగిపోయేయి. గుండె బరువంతా గుటుక్కున మింగి, కలవరపాటు నణగద్రొక్కుతూన్న కంఠంతో "కూర్చో అమ్మా—నిలబడి వున్నావు" అన్నాడు.

బట్ట వియ్యాలలోంచి పిలు పొచ్చిం దని, ఆ అమ్మాయి వెళ్లి శిశువును చంకపెట్టు కొచ్చింది. ఏడాది వెళ్లింది, కుర్రాడు.

"అమ్మా! తాత" అన్నాడు.

"తప్పమ్మా"

ఒక గగుర్పాటు సన్యాసిని భూకంపంవలె వణికించింది. తటాలున లేచి, "అమ్మా, తలుపు వేసుకో" అని చెప్పి దారిబట్టేడు. అతని దృష్టిల్లోంచి వెలువడ్డ మూగ ఆశీస్సు ఆమాతాశిశువుల శిరస్సులు ముద్దాడింది!

* * * *

ఈస్మృతినాటకంలో నాపాత్ర యేమో నాకే బోధపడటం లేదు.

ఆంధ్రులకర్తవ్యం

మారేమండ రామారావుగారు, ఎం. ఏ., బి. యిడి

ఆంధ్రు లారంభించని వుద్యమాలే లేవు. అయితే జయప్రదంగా కొనవరకూ సాగించబడినవిమాత్రం చాలాతక్కువ. ఏమైనా ఒక కొత్తపని ఆరంభించబడిందంటే ఆంధ్రుడికి ఉద్రేకం కలుగుతుంది. అంతటినుంచీ ఆ వుద్యమమే జీవితపరమావధి అనుకొని దానిమీద తనశక్తినంతా వినియోగిస్తాడు ఆంధ్రుడు. ఈలోగా మరొకటి వస్తే దాన్లోకిదూకుతాడు తానిదివరకు చేస్తూన్నపనిని వదలిపెట్టి. ఈ చాంచల్యానికి ప్రతిఫలం ఒకపనీ పూర్తికాకపోవడమే. ఈయీ వుద్యమాలు బయలుదేరతీసిన యితరులు క్రమాభివృద్ధిపొందుతూంటే, మనం ఒక్కొకపనినే మరచిపోతున్నాం. ఇందువల్ల ఎన్నో నష్టాలు కలుగుతున్నాయి.

ఆంధ్రుడంటే ఎవరో, అతని కుండే గౌరవమేమిటో, ఇతరరాష్ట్రీయులతో సరిపోల్చిచూస్తే అతనికుండేస్థాన మేమిటో తెలియనిరోజుల్లో కొమర్రాజు లక్ష్మణరావుగారూ, చిలుకూరి వీరభద్రరావుగారూ ఆంధ్రుని చరిత్రను నిర్మించి, ఆంధ్రునికి ఆత్మజ్ఞానమూ, ఆత్మవిశ్వాసమూ కలుగచేశారు. ఇది సుమారు ఇరవైయేళ్ల నాటి మాట. ఇంతలో గ్రంథాలయోద్యమం, భాషావివాదం, అసహాయోద్యమం బయల్దేరాయి. అంతవరకూ మేజాబల్లమీద వుండి నిత్యపారాయణార్హమైన ఆంధ్రుల చరిత్రని మూలకి విసిరేసి, నడుముకట్టి యీ కొత్తవుద్యమాల్లోకి దూకేశాడాంధ్రుడు. ఆత్మచరిత్రవిచారాని కంతటితో ఫుల్‌స్టాపు పెట్టేశాడు. ప్రజాసామాన్యంతో బాటు పరిశోధకులు కూడా ఇతరరంగాలకి వలసపోయారు. ఏ ఒక్క పరిశోధకమండలో యీ చారిత్రకోద్యమాన్ని పట్టుకు తంటాలు పడుతూన్నా బాహుళ్యంమీద దానిపైన అభిమానం, అభిరుచీ పోయినాయి. అందువల్ల ఇరవైయేళ్ళనా డున్న చోటే వున్నాం మనం.

ఈలోగా ఇతరప్రాంతాల్లో ఎంతో అభివృద్ధి జరిగింది ప్రతివారూ తమ తమ రాష్ట్రీయుల చరిత్రని పరిశోధించి దేశభాషల్లోనూ, ఇంగ్లీషులోనూ కూడా చక్కని గ్రంథాలు రాసుకున్నారు. అందువల్ల ఆ చరిత్రలు వ్యాప్తి చెంది, హిందూదేశచరిత్రలో యథాయోగ్యము లయిన స్థానాలని అలంకరించాయి. ఇక మనమో? ఆంధ్రదేశచరిత్రను తెలిపే గ్రంథాలే తక్కువ. ఉన్నవైనా తెలుగులో వున్నాయి. ఇవి ఇతరులకి అగమ్యాలు. అందువల్ల హిందూదేశచరిత్రలో ఆంధ్రదేశపు ప్రశంసే కనబడకుండా పోయింది. క్రమంగా ఆంధ్రులని గురించి రెండు ముఖ్యాభిప్రాయా లేర్పడ్డాయి యితరుల్లో. దాక్షిణాత్యులు "ఆంధ్రులకి ప్రత్యేకచరిత్ర లేనేలేదు. ఉన్నా అది సమగ్రంకాదు. ఎక్కడో ఒక నాలుగేళ్ళు తప్ప మొదటి నుంచి తుదవరకూ ఆంధ్రులు పారతంత్ర్యంలోనే వుండేవారు" అని అంటున్నారు. ఔత్తరాహులుమాత్రం కొంచెం ఉదాసీనంగా "మీకేమి చరిత్ర వుందో మాకు తెలియదు. మాయిల్లే మేము దిద్దుకోలేకుండా వున్నాము. మీ యిల్లెక్కడ చక్కబెట్టగలం? అంచేత మీ కుండే చరిత్రని మీరే రాసి మాకందచేస్తే సంతోషిస్తాం" అని అంటున్నారు. ఈ విధంగా ఒకరు మనకి చరిత్రే లేదంటున్నారు. ఇంకొకరు ఉంటే అది యేది? అని అడుగుతున్నారు.

ఈమధ్య ఇంకొక వింత జరిగినది. కాశీప్రసాద్‌జయస్వాల్ అనే సుప్రసిద్ధ పరిశోధకపండితుడు 'క్రీ. శ. 150-350. నాటి హిందూదేశచరిత్రము' అని ఒక పుస్తకం రాశాడు. అందులో ఉత్తరదేశచరిత్రంతో తృప్తి పొందక ఆయన ఆంధ్రదేశచరిత్రంలో కూడా వేలుపెట్టి, పల్లవులు వాకాటకులలో ఒకశాఖవారనీ, శాలంకాయ

నులు మాగధకులు అని వారిద్దరూ కూడా ఉత్తరం నుంచి వచ్చి వుంటా రని అభిప్రాయం కలగచేసి కొన్ని తలక్రిందులు సిద్ధాంతాలు చేశాడు. ఈమహానీయుడే మొన్న డిశెంబరు నెలలో బరోడాలో జరిగిన Oriental Conference కు అధ్యక్షుడుగా వుండి మరి యొక విపరీతపు ఉద్యమాన్ని సూచించాడు. భారతీయులే భారతదేశముయొక్క చరిత్రను రచించడం అత్యవసర మనిచెపుతూ, ఈయన ఆవిషయమై ఒక ప్రణాళిక సూచించాడు. అందులో యీ ఉద్యమానికి తోడ్పడి భావి హిందూదేశచరిత్రలో భాగాలని రచించడానికి తగిన వారిని పేర్కొన్నాడు. అందులో ఆంధ్రుల పేరెక్కడా లేదు. అంతా ఇతరరాష్ట్రాల వారే. ఇదివరకే వా రంతా చరిత్రను తమలో తాము విభజించు కొని రచన కూడా ప్రారంభించా రని దర్యాప్తువల్ల తెలిసింది. ఇట్లా ఆంధ్రుల్ని వదలివేయటంలో వారి వుద్దేశ్యం తాము రచింపబోయే హిందూదేశచరిత్రలో ఆంధ్రదేశచరిత్రం అవసరం లే దనో, లేక ఆంధ్రులలో పరిశోధకులు లేకపోవడం వల్ల తామే వారి చరిత్ర వ్రాయవలె ననుటో తెలియదు. ఇక వీరు రాయగల ఆంధ్రదేశ చరిత్రం యొక్క రుజుత్వానికీ ప్రాశస్త్యానికీ జయస్వాల్ గారే తార్కాణము. ఇలాటి గ్రంథమే ముందు కళాశాలల్లో పఠనీయగ్రంథ మవుతుంది. అప్పుడు ఆంధ్రయువకులు, ఇంకొకరు తమర్ని గురించి తలక్రిందులుగా వ్రాసిన తమ చరిత్రను తప్పనిసరిగా నేర్చుకోవలసిన దౌర్భాగ్యం పట్టగలదు. ఇదిగాక Oriental conference లో జరిగిన విషయము, ఆంధ్రుల ఆత్మగౌరవానికీ, పటుత్వానికీ కూడా భంగకరంగా వుంది. ఈ అవమానాన్ని గుర్తించి మన పూర్వులు మన కొసంగిన చరిత్ర యొక్క మహత్వాన్ని పురస్కరించుకొని, మనము మన ఆంధ్రత్వాన్ని తిరిగీ సార్థకం చేసుకోవలసిన అవసరం వచ్చింది.

ఈ మహాకార్యం నిర్వర్తించడానికి కొన్ని సులభమార్గాలున్నాయి. వాటిలో క్రిందివి ముఖ్యమైనవి.

(1) ఇంతవరకూ ఆంధ్రపండితులూ, ఇతరరాష్ట్రీలవారూ, పాశ్చాత్యులూ ఆంధ్రదేశచరిత్రాన్ని గురించి వ్రాసిన గ్రంథాలనీ వ్యాసాలనీ సమకూర్చడం.

(2) ఆంధ్రపరిశోధకు లందరూ సమావేశమై సమగ్రమైన చరిత్రను రచించడానికి కావలసిన ఉపకరణాలని చర్చించి, ఒక ప్రణాళికను ఏర్పరచటం.

(3) ఒక్కొక విభాగాన్ని ప్రత్యేకకృషి చేసిన ఒక్కొకరు తీసికొని, ఆచరిత్రను వారు వారు రచించడం.

(4) ఇలా యేర్పడిన చరిత్రను మరియొక సమావేశంలో పండితు లంతా కలసి చర్చించి, దాన్ని తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ప్రకటించడం.

(5) ఆంధ్రదేశంలో అంతటా చరిత్రాత్మకాలైన ఉపన్యాసాలు, ప్రదర్శనాలు ఏర్పాటు చేసి ప్రజలలో ఉద్రేకాన్ని చరిత్రయం దభిమానాన్ని కలిగించటం.

ఈపని జరిగించడం ఆంధ్రులకి పిల్లలాటవంటిదే. ఆంధ్రులలో సరియైన ఉద్రేకం కలిగిం దంటే మళ్ళీ సంవత్సరాదినాటికి ఆంధ్రుల చరిత్ర రెండవ రూపంతో ఆంధ్రదేశంలో విలాసనాట్యం చెయ్యగలదు. ధనంకొరకై ఏమీ జంక నక్కర లేదు. ఏ అఖిలభారతోద్యమం చూసినా ఆంధ్రుల విరాళాలే ఎక్కువగా కనబడతాయి. సరియైన అభిరుచి దేశంలో కలిగితే, ఆ ధనప్రవాహాల్ని యీ ఉద్యమంలోకి సులభంగా మళ్ళించ వచ్చును. అదిగాక ఆంధ్రదేశంలో విద్యాప్రియులు దేశాభిమానులు అయిన ధనికులు, జమీందార్లు అనేకులున్నారు. వారికి యీ ఉద్యమంలో అభిరుచి కలిగిస్తే వారు ఒక్క ఆంధ్రుల చరిత్రనే కాదు పదింటిని గూడా

సానుకూలం చేస్తారు. కార్యక్రమం లోకి దిగితే సహాయం చెయ్యటానికి, పన్నెండేళ్ళనుంచి యీ కార్యాన్ని నిర్వహిస్తూన్న ఆంధ్రేతిహాసపరిశోధక మండలి ఉన్నది. గనుక, దేశంలో సరియైన ఉద్రేకాభిమానాలు కలిగించి, సమగ్రమైన ఆంధ్రదేశచరిత్రాన్ని రచించి తమయొక్క ఆంధ్రదేశముయొక్క కీర్తిగౌరవాల్ని కాపాడుకోవలసిన బాధ్యత ఆంధ్రు లందరి పైనా, విశేషించి నేటి చరిత్రపరిశోధకుల పైనా వుంది. ఆంధ్రులు వెంటనే మేలుకొని, యీమహాకార్యాన్ని జయప్రదంగా నిర్వహించవలె నని నేను మనవి చేస్తున్నాను.

ధర్మపత్ని

ఆచంట సత్యవతమ్మగారు

మండువేసవికాలము. గ్రీష్మఋతు వగుటచే నీచెవిగా డ్పాచెవికి గొట్టుచుండెను. గ్రీష్మాతపమున కాహుతి కాని ప్రాణికోటి లోకమున లేదు. పదిగంట లగుసరికే పశుపక్ష్యాదులు గూడ నెండకు తాళజాలక తల్లడిల్లుచుండెను. కాని వంట మొదలగు గృహకృత్యముల భారము వహించు గృహిణీ లోకమునకు మాత్రము విశ్రాంతి లేదు. పంచాగ్ని మధ్యము తప్పదు. కచేరీలకు సెలవు. బడులకు సెలవు. ధనాఢ్యులు నీలగిరి మొదలగు హిమప్రాంతములకేగి చల్లబడుచుండిరి. బీదలు ధనాభావముచే తాళవృంతములనే ఆశ్రయించుచుండిరి. కాని స్త్రీలకేసి చూచేవారు లేరు సరి కదా ఉదయాస్తమయములు పొయిదగ్గిర మ్రగ్గి చేసిన వంటలకు వంకపెట్టుచు మరింత ఉడికించుచుండిరి.

ఇట్టి దినములలో లండనులో నైదేండ్లుగా ఐ,సిఎస్ చదువుచున్న తన కుమారుడు వచ్చుచున్నాడన్న ఆనందముతో కామేశ్వరమ్మ అతిశ్రమపడుచు మిఠాయి, జిలేబి, రవలడ్డు మొదలగు ఫలాహారములు సిద్ధపరచుచుండెను. బిడ్డయందలి ప్రేమ గ్రీష్మమును కనబడనీకుండెను.

ఆమె కోడలిని పంపవలసినదని ముందుగనే వియ్యాలవారికి కార్డు వ్రాయించెను. ఐదుసంవత్సరములుగా మగని ముఖమునకై చంద్రకాంతికి వేచు చకోర మట్లు వేచియున్న జానకి మామగారివద్దనుంచి వచ్చిన జాబు చూడగనే ముఖ మింత చేసికొని తలిదండ్రులను ప్రోత్సహించి సమస్తపరికరములతో నన్నగారు తీసికొనిరా రాజమండ్రి వచ్చి చేరెను. కామేశ్వరమ్మ అందరి అత్తల వంటిది కాదు. మంచి మనిషి. కోడలి సుగుణములు గ్రహించి, ఆదరించు సుగుణవతి. ఆప్యాయముగా కోడలి నాదరించి ఆమె యన్నను రెండు దినము లాపుకొని మర్యాద జేసి నూతనవస్త్రబహుమానపురస్సరముగా బహూకరించి పంపించెను. పిదప అత్తగారికి విశ్రాంతి కలుగజేసి సమస్తగృహకృత్యము జానకి పరమోత్సాహముతో జేసివైచుచుండెను.

ఆనందరావు వచ్చే రోజు వచ్చెను. ఉదయము తొమ్మిది గంటలకే మెయిలు. ఇంట్లో జానకి కామేశ్వరమ్మగార్ల ఆనంద మమితముగా నుండెను. ఉర్లగడ్డ ఉల్లిపాయ మసాలతో నొకకూర. మువ్వాంకాయ కూర. కొబ్బరి కోరు పెరుగు పచ్చడి. పప్పు. తెల్ల అప్పడములు, వడియములు, పులుసు మిరియాల పొడి చారు మొదలగు పదార్థములతో వంట సిద్ధమైనది. శేమియాపులిహోర (చిత్రాన్నము) సొజ్జప్పములు తన కొడుకు కిష్ట మని చేయించెను. ఇంతన్ని

కడిగి ముగ్గులు పెట్టిరి. పెళ్లివారియిల్లులాగ అలంకరించిరి. సముద్రయానపు వెలి లేకాలములో లేవు గనుక వెలన్నవారికే వెలి. వారి ముఖ్యబంధువులను కుమారుని పంక్తి కాహ్వానించిరి.

అస లింత పెద్ద యొత్తులే యిష్టము లేదు శ్రీరాములునకు. తన ఆదాయమున కనుగుణ్యమగు విద్యయే చాలు నని ఆతని తలంపు. ఆతనికీ ఆనంద మొక్కడే కాని, మరి కుమారులు లేరు. బాల్యమాదిగా ఆనందరావున కతిచురుకుగా విద్య వచ్చుచుండెను. ఒక్క క్లాసైన ఫెయిలై యెరుగడు. అందుచే నింటిపట్టున రాజమండ్రిలో నెంతవఱకున్నతవిద్య యున్నదో అంత పర్యంతము చదువు చెప్పించి ఉద్యోగములో ప్రవేశపెట్టించెద నని తండ్రి తలంపు. అటు కాదు. ఒక్కగా నొక్క కొమారుని పెద చదువు చదివించి ఏకలకగీతా శాపురుషుల కా ఆవరణ పదిరెట్లు ధనవ్యయము చేయించునుగాని చదువులోను శ్రద్ధయే. సారూప్య మందుటలోను శ్రద్ధయే.

ఇంక పెలిగ్రామములకు మొదలు, తీరా అబ్బాయిని పంపాము. పొరుగూరిలో అందులో విదేశములో వాడెట్టి పాట్లు పడుచుండెనో యన్న దిగులుచేత నైతే నేమి భార్య పోరువలన నైతే నేమి శ్రీరాములు కుమారునికి ధనము ప్రవహింపజేయుచుండెను. నిల్వసొమ్ము గాక యీ రైదు సంవత్సరములకు భూములు యిల్లు తనఖాలు పెట్టి మరిపదివేలు పోసెను. అప్పటికే ఆయన మనస్సు చివుకు తాటాకు ననుకరించెను. ఆస్తి అంతయు పరహస్తగత మాయెనే యన్న బెంగతో తిండి సరిగ తినక చిరాకుపరాకులతో కాల మెట్లో గడుపుచుండెను ఆడదాని కిదంతయు నక్కరలేదు. ఇంత

దొరగారివేసపరికింప తన కుమారరత్నమే. సూటు, బూటు, హ్యాటుతో అసలే ఎర్రనివాడేమో అచ్చముగా పాశ్చాత్యునివలె తయారైనా డాతడు. పంచెధరించిన తండ్రితో భాషింప నామర్దా కాబోలు, ముక్తసరిగా మాటాడి కారెక్కెను. తండ్రి కప్పుడే తల తిరిగింది. కుమారుని వెంట నిడుకొని రయిట్లో యింటికి ఘటము జేరవేసెను.

హిందూమర్యాదలు వేరు. యూరపియులవి వేరు. ఐదేండ్ల ప్రవాసములో అక్కడి నడవడిక లిట్టే పట్టుకుని యిప్పటి మన యువకులు పుట్టి యిరువదేండ్లుగా పెరిగిన హిందూధర్మముల నిట్టే మరచు టెంతటి యవివేకమో గ్రహింపుడు. ఆనందు డీ తరగతి మహానుభావు డైనాడు.

ఆనాడెట్లో ఎదురుగా వచ్చిన తల్లికి బంధువులకు అతిముక్తసరిగా విధిలేక జవాబులు చెప్పి, భుజించి లేచెను. కాని అందరు వింతగా మూగుట, తల్లి పల్లెటూరిదానిలాగ పదేపదే పరదేశవార్త లడుగుట భార్య తొంగిచూపులు తండ్రి ఆచారవ్యవహారములు తల్లిమడి, నేలమీద విస్తరిలో వడ్డించిన పదార్థములు చేతితో కలిపికొని తినుట ఘోరకృత్యములుగా నాతనికి దోచుచుండెను. హిందూసుందరి, భార్య యింపుగా చూపట్టుట లేదు. అనగ లేమిటి? ఆ బిగింపు సిగ రేమిటి? ఆకుంకుమ బొట్టెందుకు? ఆ నల్లని మసేమిటి కళ్ళకు? ఆసి గ్గెందుకు? ఆనందరా వంటా రేమిటి? అతడు టేబిలు, కుర్చీ, పింగాణీ పాత్రలు తెచ్చుకున్నాడు. తండ్రి పంక్తికి భోజనమునకు వచ్చుట లేదు. విసుగెక్కువైనది. ముఖము చిట్లింపు హెచ్చినది. తల్లితో ప్రేమగా మాట్లాడుట లేదు. భార్యను పలుకరించుట లేదు. ఆ వేళ కింత తన గదిలో బల్లపైని ఆహారము తినుట, వీధిలో షికార్లు బలిసినవి.

ఇంక చేయునదేమని ముఖాముఖములు చూచుకున్నారు తల్లిదండ్రులు. "నీకు కావలసిందే. చేతులు కాలాయి,ఆకులుపట్టుకుంటే కార్యమేమని," కామేశ్వరమ్మను, కసిరినాడు శ్రీరాములు. అంతగా తను ప్రేమించినకుమారుడు, ఒక్క కన్న కొడుకు భవిష్యత్తును నమ్మి యావదాస్తియు, వ్యయపరపించిన తన యవివేకమునకు కండ్లనీరు గార్చి, తన విద్యకై తండ్రి నడుగుటకు భయపడి, నక్కవినయములుగా తన్ను ప్రార్థించుచున్న ఆనందుని వెనుకటి స్థితికిని, అతిదిట్టరియై నిర్దయాత్ముడై, తలిదండ్రులవంక జూడక, నిరాకరించుచున్న యిప్పటి ఆనందుని అవతారమునకు మనసులో, నామె శాపాయుధములు పరపుచుండెను. కాని, ఏమిచేయగలదు? "అడ్డాలనాడే బిడ్డలు కాని గడ్డాలొచ్చాక బిడ్డలా" అన్న సామెత ఉత్తదా! ఇక ఆనందునివలన సుఖపడుద మనెడి ఆశ సున్నయైనది. ఇక జానకి మనోవ్యధకు పారమే లేదు.

ఇంతలో ధరలు మంద మగుటచే, తణఖాఆస్తితో అప్పు తీరదేమో యన్న భయమున అప్పులవారు శ్రీరాములుపై వ్యాజ్యము వేసి, డిక్రీలుపొంది ఇల్లు పొలములు వేలము వేయించి తమ సొమ్ము రాబట్టుకొనిరి. వారు ఉండ యిల్లు, పండ మంచము లేకుండ బికారులైరి. కాని, ఆనందరావున కీ పరివర్తనము చీమ కుట్టినట్లైన లేదు. తనవల్లనే వీరి కింత దశ వచ్చిన దన్న సంగతే గ్రాహ్యము లేదు. ఇంతలో, డిప్యూటీకలక్టరుపదవి ఆనందరావునకు లభించెను. లభించుట తడవుగా సమస్తముధారపోసిన తలిదండ్రులకు జెప్పక, భార్యనైన తీసికొనక తన మూట ముల్లె సర్దుకొని వెళ్లిపోయెను. ఈ చర్యతో తలిదండ్రుల హృదయములు బ్రద్దలయ్యెను. జానకి మనోవ్యధతో క్రుంగిపోయెను.

నిలుచుటకు నీడ లేక, శ్రీరాములు, భార్యా, కోడలి సహితముగా బంధువు లింట తల దాచుకొనిరి. "తెప్పలుగ చెరువు నిండిన గప్పలు పదివేలు జేరు" నన్నట్లు, ధన మున్నప్పు డతిథులుగా వచ్చి తినిన బంధువు లీదశలో నాదరించెదరా? కొన్నాళ్ళు, యూరుకొని, వారు మ యింట్లో శుభకార్యము గాన యిల్లు ఖాళీ చేయ మని చల్లగా జెప్పిరి,

జానకిని, పుట్టినింటికి బొమ్మని బతిమాలిరి; కాని, ఆగుణవతి "ఎట్టి సాధ్వీలకును పుట్టిన యింట్లను, పెద్దకాలు మునికి తద్ద తగ దన్న" కణ్వమహర్షి వాక్యములు తలచి వప్ప దయ్యెను.

"ఐదేడు లిదివరకే మీ యండ నుండక పుట్టింట బడి యుంటిని. మరల నే మని పోగలను? అందులో ఇట్టి హైన్యదశయందు, పుత్రునిచే పరిభవింపబడి దీనత నున్న మాన్యులగు అత్తమామల వదలిపోవుట నాకు ధర్మమా? అదియును గాక పతి సేవకు నోచనైతిని. పూజ్యులగు పెద్దల సేవ కూడ నాకు లేకుండచేయుట మీకు న్యాయమా? యని వేడికొని కష్టములలో వారి ననునయించుచు; మహారాజు పుత్రిక యయ్యు, రాజ్యహీను లగు అత్తమామల సేవించి అరణ్యక్లేశము లనుభవించిన సావిత్రివలె వారి నెడబాయకుండెను.

కష్టపడినవారు సుఖపడుట సులభము కాని సుఖపడి కష్ట మనుభవింప దుస్సహము. స్వయంకృతాపరాధమునకే విలపించుచుండిన కామేశ్వరమ్మ ననవరతము శ్రీరాములు, మన దశ నీవిధముగా మార్చిన దానవు నీవే యని దెప్పని గడియ లేదు. దీని కామె సహింపలేక కొడుకున్న అమలాపురముజేరి, కరుణముగా విలపించి యడిగిన మంచి దని, తన నమ్మకము మగనికి చెప్పెను. "అంత కింతైనది. ఇంత కెంతగునో? సర్వము వాడి కాహుతి జేసి సన్యాసుల మైతిమి చాలక వానిని యాచించి అవమానము కూడా పొందాలా"యని త్రాచుపాములా కలవచ్చెను. "నీయిష్ట మెట్లనో ఏదు మంచిగా వచ్చిన సరే సరి, అవమానము పడి వత్తువా, నీ కిక్కడ తావు లే దని ఖండితముగా చెప్పెను.

కొడుకు కదా యని తలచి ఎట్లనో అమలాపురము జేరి, ఆనందరావు బహుదూరుగా రున్న బంగళా ప్రవేశించి, అక్కడ నున్న నౌకర్ల ద్వారా "మీ తల్లిగారు మాటాడ వచ్చినా" రని కబురుచేయగా "యిప్పు డెవరితోడను మాట్లాడుటకు వలనుపడదు. ఆఫీసు కాగితములు చూచుకొనుచున్నా" రని జవాబువచ్చెను. దానితో కామేశ్వరమ్మ కాగ్రహము జనించి, "వీడి కింత పొగరా? తన చదువునకై నన్నెంతగా వేడెను? అప్పటి దీనాలాపముల కింత పొగరా? నాకు వీని ఆజ్ఞ యేల" నని బిరబిర మేడపై కేగి, డ్రస్సు వేసికొని తల్లి వచ్చిన దన్న నెపమున, నెచ్చటికో బోనున్న కుమారుని యెదుట నిలచి "ఆనందా! ఎంతటి వాడ వైతివి" అని పుత్రప్రేమచే బారున నేడ్చెను. ఈ రీతి తల్లి బీదరాలై, పెద్ద హోదాలో నున్న తన యెదుట విలపించుట సహ్యమై ఏమీ? మంచిచెడ్డ తెలియక ప్రవర్తిస్తున్నావు. నౌకర్ల యెదుట నా "ఆనందా? అనెదవు? ఎల్లకాలము ఆనందు డేనా? కలెక్టరీపదవిలో ఘనీభవించిన నన్ను యెట్లుగా పిలువవలెనో, తెలియదా? తక్షణము నాయెదుటనుండి పొమ్మ, అనెను.

"మూర్ఖుడా? కచేరిలో కలెక్టరువు కాని, తల్లి వద్ద కలెక్టరువా? నీ కెంతహోదా అబ్బిననూ నాకు బిడ్డవే కదా! తెలియకుండా మాట్లాడెద వేమి? రెక్కలు వచ్చేవరకు నాయండ కావలెనే వచ్చెనా? నీకొఱకై సర్వ మర్పించి నీ కెగురుటకు రెక్కలు కల్పించిన తలిదండ్రు లనాథు లైరా? దీనావస్థలో తలిదండ్రులను వదలి, వారి నాకటి పాలు జేసి, నీవు సుఖపడ జూచితివి యా? పుత్రధర్మము. తిన తిండియు, కట్ట వస్త్రము లేకుండ మేమిట్లు గా నగుట నీకొఱకే కదా? ఇట్టి మా దశ నరయక వర్తించిన నీ కీలోకముననే కాదు, నరకమందు కూడ చోటు లేక అధోగతిపా లగుట కించుకయు సందేహము కలదా? ఓరీ, పితృద్రోహీ! కులాంతకా, "మాతృదేవో భవ"యన్న వడుగునాటి మాట మరచితివా? ఘాతుకమృగ మైన తల్లిని చూడగనే ఆనందమున చెంగున గంతువైచి తల్లి చెంగట నిలచునే? మానవాకారరాక్షసుడవై నీవు చదివిన చదువునందలి సార మింతయా? ధర్మపత్నిని క్షోభపెట్టిన ఘాతుకా, నన్ను పొమ్మనెదవా? నిన్నింతవాడిని చేసిన దెవరి సొమ్ము? నీ పూర్వచరి

త్రను దలచికొనుము. డబ్బుకై యెట్టి దీనాలాప ములాడితివో? మారికై నాచేత జనకునకు చెప్పించి ఉద్యోగార్హత నొందజేసిన తలిదండ్రుల రుణ మెటుగా దీర్చుకొనగలవు? "మాతాపితల నా

టని ఉద్యోగము వాపసుతో అధికారగర్వము తారుమారై పూర్వపు చిన్ననాటి విద్యార్థి జీవిత మండలి దృశ్యము స్మృతిపథంబున తాండవించు [illegible]

మారెనో యీస్థితి యెట్లు వచ్చెనో ఆమెకు తెలియక తల్లడిల్లుచు మాటాడుటకైన శక్తి లేని తన పతిని జేరి సమస్తోపచారములు చేయుచు తన కుంగ డమ్మగా మిగిలిన చిల్లరవస్తువు లమ్మివైచి, మంచి వైద్యుని రావించి, మందిప్పించుచు, పథ్యపానంబులు సకాలంబున నిచ్చుచు క్రమముగా రోగవిముక్తిని జేసెను. ఇంతటి పరిచర్య చేయుచు తన్నతి భక్తిశ్రద్ధలతో కొలుచుచు, భాగ్యదారిద్ర్యములందు కూడ సమానభక్తివిశ్వాసము లుంచి సేవించు నది తనధర్మపత్ని యగుట యెఱిగి, ఆనందుడు జానకి రెండు కరములు బట్టుకొని బతిమాలుచున్నట్లుగా జూచెను. రెండు వేడి కన్నీటిచుక్కలామె కరములపై బడెను.

జానకి వడకుచున్న కరములతో ఆనందుని నయనముల దుడిచి, పూర్వచరిత్ర మరువవలసిన దని వేడికొని, శరీరము బలపడువరకు నే విచారములకు హృదయమున తావీయవల దని బతిమాలి, తాను జీవించియున్నంతవరకే కొఱత గలుగజాల దని నుడివి, ధర్మపత్నీత్వము సార్థక మగునట్లు ఉపచరించుచు ఆనందుని, యథారోగ్యవంతునిగా నొనర్చెను.

అతడు తన భార్యవలన తలిదండ్రుల వృత్తాంతమెఱిగి, వారికై విచారించుచు అనేకపట్టణగ్రామంబుల వెదకించెను, గాని లాభ మిసుమంతయు లేకపోయెను. కొన్నాళ్లకొక స్నేహితుని ద్వారా కాశియందలి బైరాగిమఠమున నొకాయన కలిసె ననియు, గృహకల్లోలములచే సంపూర్ణవిరక్తుడై నందున, చివరి దశ, విశ్వేశ్వరసేవచే కృతార్థత నొందింప దృఢనిశ్చయుడనైతి నని యొకరితో వచింప వింటి ననియు స్నేహితుడు పలుక నాతడే తన తండ్రి యని నిర్ధారణ చేసికొని, క్షమార్పణ వేడి తీసికొనరా కాశి కేగెను; కాని, తండ్రి పట్టుదలగా మరల గృహమధ్యమున నుండ నని "పుత్రులు శత్రులు గాక మిత్రులే" యనియు, అట్టి శత్రుమధ్యమున నుండ నని నిరాకరించెను. మాతృదేవత జాడ మరి లేదు. ఇక చేయునది లేక ధర్మపత్నీద్వితీయుడై స్వస్థలము చేరి ఆనందు డధికారము మరలిరా, సుఖముగను ఆనందముగను జీవించుచుండెను.

వేదికలు - పత్రికలు

'బతికే వుంది'

అవధానిశిరోమణి, పండిత, కాశీ కృష్ణాచార్యుల వారు తమకు ౬-3-38 తేదీని నిడదవోలుపౌరులు స్వాగతసత్కారాలు చేసినపుడు సంస్కృతభాష యొక్క సజీవస్థితినిగురించి యిలా సెల విచ్చారు.

"ఇపుడు చాలమంది సంస్కృతభాష నిర్జీవభాష యని పలుకుచుందురు. నిజము చూచినచో మన దేశమున సజీవభాష సంస్కృత మొక్కటి తప్ప మరేదియును లేదు. అనాదికాలమునుండియు సంస్కృతమే తక్కిన అన్నిభాషలకును మూలాధారముగా నున్నది. సంస్కృతభాషపై నాధారపడని భాష మరేదియు లేదు. హిందీ, మహారాష్ట్రము, కన్నడము, తెలుగు, ఉత్కళము, మున్నగు దేశభాష లన్నియును సంస్కృతపదములతోనే నిండియున్నవి. ఆర్యభాషల కన్నిటికిని ప్రాణభిక్షను బెట్టునది సంస్కృతమే. ఆభాషలలో నున్న సంస్కృతపదములను దీసివేసినచో నవి అంతరించిపోవుట నిశ్చయము; కావున సంస్కృత మొక్కటియే

సజీవ మగు మాతృభాష. అది స్వతంత్రము. తక్కిన వన్నియు దానిపై నాధారపడినవే. ప్రాచీనకాలపు ఆర్యులు దేవికానదీతీరమున నివసించుచుండిరి. అచట సంస్కృతము, లేక దేవభాషయే వాడుకభాషగా నుండె నని మహాభారతమునం దున్నది. ఆర్యభాషలు కావనబడునట్టి యితరభాషలలో గూడ సంస్కృతపదముల లక్షణము గోచరించుచునే యుండును. తగిన గురువు లభించినచో సంస్కృతభాషను మిక్కిలి సులభముగానే అభ్యసింపగలుగుదుము. ౫, ౬ ఏండ్ల బాలురకును, బాలికలకును గూడ సంస్కృతభాషయం దాసక్తి కలిగించుటకు తగిన విధానమును నేను చాల విద్యాలయములలో చూపించియుంటిని; గాన దీనిని సామాన్య మగు తెలివితేటలు గలవారు గ్రహింపజాలరనుట వట్టి దుర్భ్రమ. యజ్ఞస్థలములలో తప్ప తక్కినస్థలములలో సంస్కృతభాషను వాడుటకు కఠిననిర్బంధము అవసరము లే దని మహాభాష్యమున్నగు ప్రామాణికవ్యాకరణగ్రంథములలో స్పష్టముగా తెలుపబడెను. సంస్కృతము మొదట వాడుకభాషగానే యుండెను. తరువాతనే అది గ్రాంథికభాష యైన దను విషయమును ప్రజలు కాలక్రమమున మరచిపోవుటచే మధ్యకాలముననే కఠిననిర్బంధము లేర్పరుపబడెను. మన దేశీయు లందరును ఇపుడు జర్మనీదేశమువారిని చూచి యైన సంస్కృతముయొక్క విమలయశస్సునకు భంగము కలుగకుండ కాపాడెదరుగాక యని నమ్మెదను".

పర్లాకిమిడి ౨, ౪ భాగాలు

పర్లాకిమిడితాలూకాలోని ౨, ౪ భాగాలైనా ఒరిస్సారాష్ట్రంలో కలపకపోతే వొప్పుకో మని బెదిరిస్తూ వున్న ఓఢ్రుల వాదాన్ని శ్రీ గండికోట సత్యనారాయణమూర్తి ఎం. ఏ, గారు (౧౨-౩-౩౪ తేదీ) ఆంధ్రపత్రికలో యిలా ఖండిస్తున్నారు.

"..........చరిత్రాత్మక, ఆర్థిక, పరిపాలనా విషయిక, జాత్యాధారవిషయిక, భాషావిషయిక సందర్భములను గమనించినచో పర్లాకిమిడితాలూకాలోని ఏ భాగమును గూడ ఒరిస్సాలో కలుపగూడ దని విశదము కాగలదు. ఈ తాలూకా ఒరిస్సాలో అంతర్గత మైన భాగముగా నెన్నడును లేదు. శాసనములం బట్టి విమర్శించినచో ఈతాలూకాకు ఓఢ్రులకన్న తెలుగువారే ప్రాచీను లని తెలియగలదు. దేశపు టాదిమనివాసులలో చేరినవా రగు సవరలు తెలుగువారికన్న ముందే ఈతాలూకా నాక్రమించియుండిరి. సవరభాష కీతాలూకాలో తెలుగుభాష సంపర్కమే యెక్కువ. ఈతాలూకాయం దుండు సవరలు చాలమంది కాపుసవరలు. ఓఢ్రభాష బొత్తిగా మాట్లాడలేని సవర లనేకులున్నారు. పర్లాకిమిడ్డి లేని ఒరిస్సారాష్ట్రము శిరస్సు లేని మొండె మని ఉత్కళసోదరులు చెప్పెడి మాటలు అలంకారయుక్తముగా కానవచ్చుచున్నను అవి వాస్తవముగా అర్థము లేని మాటల ప్రోగు. ఏమన? ఏయుగమునందు గాని ఒరిస్సాకు పర్లాకిమిడి శిరోమాణిక్యమువలె నుండుట గాని, పర్లాకిమిడి పురాతనపురాజులు ఒరిస్సారాజులకు సామంతరాజులుగా వ్యవహరించుట గాని లేదు. జాతినిబట్టి చూచినచో ౧౯౩౧ వ సంవత్సరపు జనాభాప్రకారము ఈ తాలూకాయం దున్న ౨౯౩౩౧౯ జనులలో ౧౫౬౭౫౯ మంది తెలుగువారున్ను, ౬౭౫౨౨ రు మాత్రము ఓఢ్రులున్ను కలరు. ౧౦౦ కి ౫౩ రు తెలుగువారున్ను, ౨౩ రు మాత్రము ఓఢ్రులున్ను ఉన్నారు. శేషించిన ౨౪ రున్ను సవరలు మొదలైనవారు గాని ఓఢ్రు లెంతమాత్రము కారు. భాషనుబట్టి చూచినచో తెనుగు మాతృభాషగా గలవారు ౧, ౯౩, ౪౭౫ రు. ఓఢ్రము మాతృభాషగా గలవారు ౬౧, ౩౨౦ మంది మాత్రమే. అనగా ఈ తాలూకాలో ౧౦౦ కి ౬౫ రికి తెనుగు మాతృభాష. ౨౧ మందికి మాత్రమే ఓఢ్రము మాతృభాష. ౭౫౨౦ మంది మాత్రమే ఓఢ్రభాష యితరభాషగా మాట్లాడువారు. ౪౫, ౩౪౩

మందికి తెలుగు రెండవ భాష. ఈ తాలూకాయం దున్న (?) గ్రామములలో ౬ గ్రామములలో మాత్రము నూటికి నూర్గురు ఓఢ్రు లున్నారు. అయితే వీరి జనసంఖ్య ౧౦౦౦ కి తగ్గియే యున్నది. ౫౧ గ్రామములలో నూటికి నూర్గురు సవర లున్నారు. ౩౫౦ గ్రామములలో నూటికి నూరుగురో లేక ౯౦ మందిరో తెలుగువా రున్నారు. తాలూకాయందలి అత్యధికసంఖ్యాకు లగు జమీందారీ రైతులున్ను, ఇనాందార్లున్ను తెలుగువారే. చెన్నపురి సెన్ససు సూపరెంటెండెంటుగారి విభజనము ప్రకారము ఈ తాలూకా రెండవభాగములో నూటికి షుమారు ౩౦ మంది తెలుగువారున్ను, ౨౦ మంది ఓఢ్రులున్ను, ౫౦ మంది సవరలున్ను ఉన్నారు. ఆవిభజనము ప్రకారము తాలూకా నాల్గవభాగములో నూటికి ౬౧ మంది తెలుగువారున్ను, ౩౫ గురు ఓఢ్రులున్ను, ౪ మాత్రము సవరలు మొద లయినవారున్ను కల రు. ఈ నాల్గవభాగములో పర్లాకిమిడిపట్టణమున్ను సుమారు ౧౩౦ గ్రామములున్ను కలవు. ఈ ౯ వ భాగపు జనసంఖ్య సుమారు ౮౩౦౦౦. జనాభా లెక్కలప్రకారము విశద మగు మీది వివరణముల వలన ఈ తాలూకాయున్ను, ముఖ్యముగా ఇప్పుడు ఓఢ్రులు ఒరిస్సాలో కలుపు డని కోరుచున్న తాలూకాయందలి రెండవ, నాల్గవభాగములున్ను కేవలము తెలుగు ప్రాబల్యము కల వని విశద మగుచున్నది. ఈభాగములలోని జనాభాలో చాల తప్పు లున్నట్లున్ను. తెలుగువారిక్రింద నమోదుకాబడవలసిన ఆసాములున్ను గ్రామములున్ను ఓఢ్రులక్రింద నమో దైనట్లున్ను తెలియవచ్చుచున్నది. ఈజనాభావిషయమై యాంటీయమాల్గమేషనుసొసైటీవారి ప్రత్యేకకమిటీవా రిప్పుడు చేయుచున్న విమర్శనము పూర్తి కాగానే గవర్నమెంటు లెక్కలలోని తప్పులున్ను, ఉత్కళసోదరుల ఆసందర్భపు వాదనలున్ను వివరణప్రణాళికలతో గవర్నమెంటువారి పరిశీలనార్థము ప్రచురింపబడును. ౧౯౩౧ వ సంవత్సరపు జనాభాలెక్కలమీద నాధారపడినను ఈ తాలూకాయున్ను అందలి ౨ వ ౪ వ భాగములున్ను కేవలము తెలుగుప్రాబల్యము కల వని తేటపడకమానదు. ఇట్టి తెలుగుమయమగు తాలూకాయం దేభాగము ఒరిస్సాలో కలిపినను తెలుగువారి ఆచారవ్యవహారములకున్ను, భాషకున్ను, సారస్వతమునకున్ను, ప్రత్యేకవ్యక్తిత్వమునకున్ను తీరనికష్టనష్టములు వాటిల్లును. ఓఢ్రుల శ్రేయస్సునకే ఉద్దేశింపబడిన భావి ఉత్కళరాష్ట్రపురాసనసభలో తెలుగువారికి పలుకుబడి కుదురదు. జాతిని బట్టి వైషమ్యభావములు కలిగియున్నట్టియు, రాజకీయముగా వెనుకబడియున్నట్టియు, ఆర్థికముగా నిలుచుటకే శక్తి లేనట్టియు ఓఢ్రుల పరిపాలనకు నాగరికత గల తెలుగువా రెన్నడును లోబడియుండనొల్లరు. ఎక్కువ పరిపాలన సౌకర్యముల నొసగు చెన్నపురి ప్రభుత్వమును వదలి, జాస్తిపన్నులను భరించెడు శక్తి లేనట్టియు, వరదల వలనను, కాటకములవలనను ఇంచుమించుగా ప్రతి సంవత్సరము ఆదాయముకన్న వ్యయమే అధికరించునట్టియు, కేంద్రప్రభుత్వమువారి సాంవత్సరికధన సాహాయ్యము లేకుండ రాజ్యాంగవ్యవహారచక్రమును నడిపించుటకే అవకాశము లేనట్టియు ఒరిస్సాప్రభుత్వమునకు లోబడి ఈ తాలూకా తెలుగువారు కష్టముల పా లవుటకు ఒప్పుకొనరు. మిడ్నపూరు ఓఢ్రులే ఒరిస్సాసమ్మేళనమును బహిరంగముగా నిరాకరించియుండ ఈ తాలూకా తెలుగువారు రాజావారి కోరికప్రకారము ఒరిస్సాసమ్మేళనమును వాంఛించుచున్నా రనెడు వాదము వ్యర్థవాదము. ఈ వాదమందలి రహస్యము గవర్నమెంటువారికి అనేకవిధముల తాలూకా తెలుగువారు విశదపరిచియుండిరి. ఈ తాలూకాయందలి కొన్ని భాగముల నైన ఒరిస్సాలో కలుపకపోయినయెడల భావిఒరిస్సారాజ్యాంగక్రమము నడిపించమని ఉత్కళసోదరులు బెదిరించిన మాత్రమున యుక్తాన్వేషణ చేయకుండ గవర్నమెంటువారు ఈ తాలూకా తెలుగువారిని అధోగతిపాలు చేసెదరా?

ఉత్కళులకు ప్రత్యేకవ్యక్తివిజృంభణము కావలసినప్పుడు ఆంధ్రులకు మాత్రము ప్రత్యేకవ్యక్తిత్వవిజృంభణము అక్కరలేదా? ఓఢ్రులు ప్రత్యేకోత్కళరాష్ట్రనిర్మాణమును కోరుచున్నట్లే ఆంధ్రులు కూడ ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణమును వాంఛించుచున్నారు. కేవలము తెలుగుప్రాంతములను ఒరిస్సాలో చేర్చినచో ఆంధ్రులు మాత్రము ఆందోళనము చేయరా? ఆంధ్రలోక మీసంగతి గమనింపవలెను"

వేశ్యలు పనికిరారూ?

కృష్ణాపత్రిక చేసిన "కాలేజీగరల్" నాటక విమర్శను పురస్కరించుకుని "నైతికజీవనానికీ, కళాకౌశలానికీ సంబంధం ఏమిటీ?" అని నిక్కచ్చిగా అడుగుతూ (౧౦-౩-౧౯౩౮) కృష్ణాపత్రికలో శ్రీ పింగళి నాగేంద్రరావుగారిలా రాస్తున్నారు.

"పాత్రయొక్క విశిష్టభావాభినయాన్ని రసవంతంగా, సముచితంగా నిర్వహించి ప్రదర్శించే నటునియొక్క గాని, నటియొక్క గాని 'అభినయ-తాహతు' కున్నూ, వారి సామాన్యజీవన విధానానికిన్నీ కళావిషయికంగా ఎట్టి సంబంధము ఉండదు. ప్రదర్శనం సజీవంగా, ప్రభావవంతంగా ఉన్నంతకాలం ప్రేక్షకుల దృక్పథాన అవిశిష్టభావాభినయాన్వేషణమే ప్రతిఫలిస్తుంది. అక్కడినుంచి నైతికఛాందసాలు తోక ఝాడించాలిసిందే. ఆనటులు రంగంమీద ఉన్న ఆకాసేపు అది అభినయకార్యం. కావ్యకర్త, కడుపుకక్కుర్తికి కనపడ్డవాళ్లకి కవి అమోఘా లిప్పించేవా డని రామాయణప్రభావం కుంటువడుతుందా? ఆసమయానికి అతడు సృష్టికర్త. మహాయోగి. కాలం అరికట్టింది కనక, పగలు బానిసగ పడి ఉంటాడు; కాని బానిసవృత్తి రాత్రి రాజువేషం వేయడానికి అడ్డురాదు. అసలే నటన. నటనాకౌశలం ఉంటే కావ్యానికి వ్యాఖ్యానాల్ని మార్చవొచ్చు. రామదాసునాటకానికి నాటకగౌరవమే చింతనీయం. దాన్ని కీ. శే. కందాడై శ్రీనివాసయ్యంగారు చేపట్టిన రోజుల్లో అది తానిషానాటకంగా చూడబడేది, ప్రేక్షకుల మోజంతా తానిషామీద ఉండేది గనుక. శ్రీ రాఘవాచారిగారి ఆరాల్లోకి వచ్చిం తరువాత భద్రాద్రిరామదాసు భక్తితన్మయత్వం అంతా తాండవరూపం తాల్చడంతోటే దాన్నే రామదాసునాటకంగా చూస్తున్నాం. ఇద్దరూ సరసాభినయచణులైన నటు లవడంచేత ఎవరు రంగమునకు తెలసిన ఒంగ్గా తైపు. మరి గోల్కొండనవాబు దర్జాల్ని, విలాసాన్ని, భోగలాలసతనూ దొరసామయ్యంగారికి గాని, రామదాసు పారవశ్యముద్రను 'రాఘవుని'కి గాని అంటగట్టలేం గదా? జీవితానికి సంబంధించిన నీతి అవినీతులు అభినయవేళ అక్కరకురావు. పుష్కరానికి ఓమాటు ఓబరామర్గు (Obera-mergue) లో క్రీస్తునాటకమును (The Morcle Play) పాత్రముల నన్నిటిని ఆయాప్రవృత్తులు గల మనుష్యులనే ఏరి కోరి తెచ్చి పాత్రధారణ చేయించి ప్రదర్శిస్తూ ఉంటారు. కళోపాసకులు కూడ దాన్ని ఒక ఉత్సవంగా పరిగణించి చోద్యం చూడ్డానికి వెళతారే కాని రసనిధిని అభిలషించి వెళ్లరు; కాని (Matheson Long) ఆవేషమును వేసినప్పుడు ప్రేక్షకులు కళాభిలాషులై తిలకించేవారు. నందనారు నాటకంలో నరసింహంగారు రంగానికి వస్తే నవ్వుకుంటూ నమస్కారము చేశారు; గాని నటనానైపుణికి పరవశులైపోయారా? ప్రచారనాటకాలకి కూడా అభినయకౌశలం గల నటులే అవసర మౌతారు. వారి కళాప్రతిభచేతనే రంగముమీద ఏది గాని చలామణీ ఔతుంది. కళాకుశలు లెప్పుడూ రసజగత్తులో విహరిస్తూ ఉంటారు. మనం లక్ష్యం చేసే నీతులకు నియమాలకు వాళ్లు అందరు. మనం చలాయిస్తున్న పాతివ్రత్యపద్ధతులు మతనీతులు వాళ్లకి హితవుగా ఉండవు. ఈ ఛాందసావరణంలోంచి తప్పించుకుంటేచాలు అవ్వాలి ఆవ

రణ ఎట్లాంటిదైనా సరే అనుకుంటారు. అందుకనే " In short, the artist can be a Prostitute, a Pander, and a flatterer more easily, as far as external pressure goes, than a faithful servant of the community, much less the founder of a school or the father of a church " అని బెర్నార్డుషా అన్నాడు. అనుభవంలో కూడా స్టేజిమీద, ఫిలుము ల్లోనూ సీత, సావిత్రి మొదలైన పతివ్రతల కథల వేశ్యలు వేషం కట్టి అభినయిస్తుంటే వితంతువులు, విభూతిశాస్త్రులూ అందరూ ఆనందిస్తూనే ఉన్నారు. పేషెన్సుకూపరువంటి పాశ్చాత్యవనితలు కాళీ మొదలైన వేషము లు వేస్తే చేతులు జోడించి చెంప లేసుకుని మ్రొక్కి మరీ వెళ్లారు. వేశ్యలైనా అభి నయసామర్థ్యం గలవారైతే మన్ననార్హులే. రంగం మీద కులస్త్రీలైనా అసామర్థ్యం లేకపోతే వారి రాక గర్హ్యం. కన్యాశుల్కంలో మధురవాణి "వేశ్యలంటే అంత చులకనా అండీ పంతులు గారూ" అన్నట్లు, వేశ్యలు కళాధురీణలై రంగం మీదికి వచ్చేటప్పుడు 'థియేటర్ మర్యాదలు' వెను కటివలె ఉండవు"

శస్త్రచికిత్స

శ్రీ బొబ్బిలి రాజావారి చాకచక్యాన్ని మెచ్చుకుం టూ తాలూకాబోర్డుల నిర్మూలనాన్ని (౭-౩-౩౪) రంధ్రాన్వేషి యిలా సమర్థిస్తోంది.

"ప్రజాస్వామ్యం కుళ్లిశవం అని ముసోలిని అన టంలో ఘనతరసత్యం వున్నది. బహునాయకత్వం అన్ని అందాలా అనర్థకం. గత ఐరోపాసంగ్రామా నంతరం ప్రజాస్వామ్యవికృత రూపం బయటపడి, నిరంకుశమైన, ప్రజానురంజకమైన ఏకవ్యక్తిపాలన మే మేలను సిద్ధాంతము బయలుదేరి చాలాదేశాల లో నెరవేర్పబడుతున్నది. నిన్న అస్తమించిన మన తాలూకాబోర్డులు క్షుద్రసంస్థలైనా— స్వపా లన మనే మిషతో పెద్దసంస్థల కుళ్లుకు, అధికార దుర్వినియోగాలకు నెలవై మంచికంటె చెడ్డనే ఎక్కువగా కలుగుచేస్తుండినవి.

ఇవి స్పర్థలను పెంచటం అంటుండనిచ్చి, జోహుకుం అనే ఒక బానిసజాతిని సృష్టించి-బోర్డు ల నిర్మించిన రిప్పన్ ప్రభువుగారి ఆశయాలకు భిన్నం గా స్వఫరిపాలను దుష్పరిపాలనగా మార్చినవి. యుగయుగాలనుండి భారతభూమిలో రాజ్యాం గానికి ప్రాతిపదికమైన గ్రామసంస్థను పగులగొట్టి గ్రామాన్ని నిరసం చేసివేసినవి. ఇదీగాక జిల్లా బోర్డు వున్నంతవరకు వీటి వునికికే అవసరంలేదు.

ఇంతవరకు షది ఉదారాశయులైన ప్రజల వాద మై వుండింది. నేడు తాలూకాబోర్డుపాలన ప్రభు త్వ తీవ్రవిమర్శనలకు పాలై భారతీయులు స్వపాల నానికి అనర్హులనే చర్చిల్ వాదానికి సహాయ భూతం కావటం అవమానకరం. ఈమధ్య ప్రభు త్వం ప్రతిష్టానికి స్వపరిపాలక సంస్థకు ఒక ఉద్యో గిని నియమించిందంటే ఆసంస్థలపై మోజుగలిగిన వాళ్లు అవమానపడాల్సిన విషయం. ఇప్పటికైన గవర్మెంటు మొగమాటపడకుండా తనధర్మాన్ని నెరవేర్చినందులకు అభినందించాల.

ఇప్పటివరకు ఏమంత్రికి యింతటి ధైర్యంగాని, సత్తాలనా నిరతిగాని లేదంటే అతిశయోక్తి కా జాలదేమో! గర్భోద్దేశం ఏమైతేనేం యువకుడు- తానను కొన్నది ఎట్టిపరిస్థితులలోనైన జంకక చేసే దిట్టడు— బొబ్బిలి రాజాగారు తాలూకాబోర్డుల నిర్మూలించి చిరవాంఛను నెరవేర్చినారు. వీరి మేలు జాతీయభారతం ఋణపడాలను. వేరొకరు ముందు అధికారంలోకివచ్చి అనుచరుల ప్రీత్యర్థం బోర్డుల పునర్జన్మ ఎత్తించకుంటే దేశానికి మేలు! ఇంతవరకు ప్రభుత్వాన్ని పదేపదే కొనియాడా ల్సిందే"!

వ్యాఖ్యానములు

పత్రికలభాష

"తెనుగు పత్రికలలో సంపాదకీయా లెలాంటి భాషలో వుండాలి?" అంటూ యిదివర కెవరూ యిది వొక పెద్ద సమస్యగా ఆలోచించి నిర్ధారణ చెయ్యలేదు. కానైతే తెనుగు భాషలో పత్రికలు ప్రారంభమై యాభై సంవత్సరాలకంటే యెక్కువ కాలమే అయింది. అప్పణ్ణుంచీ సంపాదకులు ఎవరి శక్తి ననుసరించి వారు, ఎవరికి నచ్చిన శైలిలో వారు వ్యాసాలు రాసి దేశసేవ చేస్తున్నారు. నిజానికి, భాషావిషయం నిర్ధారణ కాకపోయినా, సంపాదకులు, పండితులకోసం గ్రంథాలు రాయతగ్గ భాషలోనే తమ రచనలు ప్రకటిస్తున్నా యీ పత్రికల ప్రచారంవల్ల ప్రజలలో విజ్ఞానం బాగానే వ్యాపిస్తోంది. అయితే; సంపాదకులు, పండితభాషలో కాక దేశంలో వాడుకలో వున్న భాషలోనే తమ వ్యాఖ్యానాలు రాస్తూ వుంటే విజ్ఞానం యింకా శీఘ్రంగానూ, యింకా యెక్కువగానూ వ్యాపించదూ?

ఇవాళ యిది వొక గొప్ప సమస్యగా పొడచూపింది. ఈ సంచికలోనే ప్రకటించబడ్డ రావుసాహెబు శ్రీ గిడుగు వేంకటరామమూర్తిపంతులుగారి దివ్యసందేశం దీన్ని తెనుగు పత్రికల సంపాదకుల యెదట వుంచుతోంది.

ఇప్పుడు మన తెనుగువారిలో సంపాదకులే కాదు, యెవరూ కూడా సమష్టిబాధ్యత వహించి నడవడం లేదు. ఇప్పటిక్కూడా తెనుగు రచయితల్లో గ్రాంథికవ్యావహారికభాషావివాదం యింకా తీవ్రంగానే జరుగుతూ వుండడం మాకు తెలుసు. కొన్ని కొన్ని సన్నివేశాలను పురస్కరించుకుని, అంత రాతు యేం చెబుతూ ...

కొందరుకొంద రింకా మారుదారిలోనే వుండడం కూడా మేం యెరుగుదుం. అయితే ఆలోచించడం వేరూ, ఆమోదించడం వేరూనూ. అలాగే ఆమోదించడం వేరూ, అవలంబించడం వేరూనూ.

నిజానికి పత్రికలు ప్రజల కందరికీ వుద్దేశించబడవి; కాని యే కొద్దిమంది పండితుల కోసమో కాదు. జనసామాన్యంలో వున్న అజ్ఞానాన్ని తరిమివేసి, స్వతంత్రభావాలను రెచ్చగొట్టి, ప్రజాశక్తి నంతటినీ యేకముఖం చేసి దేశోన్నతిని సాధించడానికి, గాని పండితులు రెడ్డికం వేసుక్కూచుని వినోదంగానూ, మడికట్టుక్కూచుని మోక్షం కోసమూ చదువుకోడానికి కాదు. అయినప్పుడు పత్రికల సంపాదకీయాలు పండితభాషలో వుంటే యేం లాభమూ?

మంచీ చెడ్డా, లాభమూ నష్టమూ చట్టున నిర్ధారణ చేసుకోడం అందరికీ సాధ్యం కాదు. వొకరు బోధించడం, కొందరు వినడం అనేవి జనసామాన్యంలో అంతటా సాధ్యపడదు. పత్రికల ప్రయోజనం అలాంటిది కాదు. రమారమీ వొక అణా పెడితే పత్రిక వస్తుంది. నడుస్తూ నడుస్తూ, పని చేస్తూ చేస్తూ, చివరికి భోజనం చేస్తూ చేస్తూ కూడా పత్రిక విప్పితే లోకం యే స్థితిలో వుందో తెలిసిపోతుంది. ఏం చేస్తే యెలా అవుతుందో, యెవరికేది మంచిదో, యెప్పుడేది అవసరమో బోధపడిపోతుంది. ఇలాంటి పత్రికలు విచారణ చేస్తే గాని బోధపడని భాషలో వుంటే యేం లాభమూ?

మనలో చదువుకున్నవారి సంఖ్య నూటికి పది కూడా లేదు. ఆచదు వేనా ప్రైమరీతో ముగిసిపోయిందే; యెక్కువ. కొందరి విషయంలో నైనా యింకో మెట్టు పైకి వెళ్ళి వుంటే ఆవెళ్ళడం యింగ్లీ ...

వచ్చిన మనవారిలో భాషాపరిచయం తక్కువ. ఎక్కువగా వున్నా పత్రికలు ప్రపంచజ్ఞానాన్ని కలిగించేవి; గాని శాస్త్రగ్రంథాలు కావు. అదలా వుండగా మేడితోక పట్టుకుని అరక సాగిస్తూనే రైతు పత్రిక విప్పవలసి వుంటుంది. దుకాణంమీద కూమని భోజనపదార్థాలు తూచి యిస్తూనే వర్తకుడు పత్రిక చదవవలసి వుంటుంది. గోచిపాత పెట్టుకుని చెమట వోడిస్తూనే కార్మికుడు పత్రిక చూడవలసివుంటుంది. కక్షిదారు చెప్పేది వింటూనే—అతనికి, కోర్టులో చెప్పవలసిన సంగతులు పాఠం చెబుతూనే న్యాయవాది పత్రిక తిరగవెయ్యవలసివుంటుంది. ఇలాగ యింకా చాలా తరగతులవారు ఏదో పనిలో మునిగివుండే పత్రికలు చదవ్వలసివుంటుంది. అలాంటప్పుడు పత్రికలు, అప్రయత్నంగా బోధపడే వాడుకభాషలో కాక, వొక పక్క వ్యాకరణమూ, వొక పక్క నిఘంటువూ, పైగా వొక పక్క పండితుణ్ణీ వుంచుకుంటే గాని కొరకబడని భాషలో వుంటే యేం లాభమూ?

పాశ్చాత్యదేశాలవారంతా యిప్పుడు భౌతికవిజ్ఞానశిఖరంమీద వుండి ప్రపంచకాన్నంతటినీ ఆడిస్తూన్నారు. ప్రాచ్యదేశాలవారిలో చీనావారివంటి నల్లమందుభాయీలు కూడా యిప్పుడు ముందుకు వెళ్లిపోతున్నారు; కాని మనం ముందుకు సాగలేకపోతున్నాం. ఈ స్తబ్ధత వెంటనే వదిలిపోతే గాని మనం అడుగున అణిగిపోతాం. ఇప్పుడు మహాపండితులైన బ్రాహ్మణులు మొదలుకుని కుటుంబవ్యవహారాలు సరిపెట్టుకోడానికి చాలిన యేకొద్ది మాటలు మాత్రమో బోధపరుచుకోగల నిమ్నజాతీయుని దాకా అందరూ అచిరకాలంలో-నిమిషాలమీద విజ్ఞానవంతులు కావాలి. (తమ స్థితి బోధపరుచుకుని, ఆవేదన పొంది, ఆవేశం కలిగి, అందరికంటే యెక్కువ స్థానంలో వుండడానికి కాకపోయినా, నలుగురితో పాటు సమంగా వుండడానికేనా "జే జగన్నాథా!" అంటూ ముందుకురకాలి; గాని గోళ్లు మీటుకుంటూ, మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ పడివుండడానికి వల్లకాదు. మనకి యీస్థితి రావాలంటే—యీ ఆవేదనా, యీ ఆవేశమూ కలగాలంటే అది పత్రికలవల్లనే సాధ్యమవుతాయి; గాని ఇతరసాధనాలవల్ల కాదు. అలాంటి పత్రికలు, "సామాన్య సంభాషణలో 'నోటిలో మాట నోటిలో ఉండగానే', వాక్యము పూర్తి కాకమునుపే, ఒకరి మనోభావము ఒకరు గ్రహించి సంభాషణోద్దేశము జనులు నెరవేర్చుకోవడము ఏలాగున సాధ్యమవుతున్నదో ఆలాగుననే" ఉపయోగించాలంటే వాడుక భాషలోనే ప్రకటింపబడితే గాని యేం లాభమూ?)

మనలో యిప్పుడు జాతియొక్క సర్వతోముఖవికాసం కోసం పాటుపడే వారిలో పత్రికాసంపాదకులకు సాటి అయినవారు మరొక తరగతివారు లేరు. రాత్రింబగళ్లు నిద్రాహారాలు మాని తల చించుకుంటూ, చేతికి వచ్చిన ప్రతీ దమ్మిడీ గుడ్డిగవ్వ లాగ వెచ్చించి సంసారం గుల్ల చేసుకుంటూ, సుఖాన్ని, ఆరోగ్యాన్ని, ధనాన్ని, సంసారాన్ని—చివరికి జీవితాన్ని కూడా మానవసేవకోసం సంతోషంతో త్యాగం చేసే పత్రికాసంపాదకులకంటే ఉత్తమశ్రేణికి చెందినవారు మరొకరు లేరు. అలాంటి పత్రికాసంపాదకులు అత్యవసరమైన యీ విషయం ఆలోచించకుండా, తొందరలోనూ, యెక్కువగానూ జీవితసాఫల్యం కలిగించే యీ భాషావిషయం నిర్ధారణ చేసుకోకుండా పత్రికలు నడపడం యేం లాభమూ?

ఇప్పుడు మన పాఠశాలల్లోనూ, కాలేజీలలోనూ మన బాలికలకీ, బాలురకీ సకలవిషయాలూ యింగ్లీషులో బోధించబడుతున్నాయి. అది మన భవిష్యత్పౌరుల కాలాన్ని హ్రస్వం చేస్తోందనీ, మెదటిని కరిగించివేస్తోందనీ, విజ్ఞానాన్ని సముకూర్చవలసిన గ్రహణశక్తిని దుర్వ్యయం చేస్తోందనీ, యావనరకాన్నంతటినీ అక్రమమార్గంలో నిరు

చేసేస్తాం దని, గొప్పగొప్ప ఫలాలు సాధించవలసిన జవసత్వాలను ధ్వంసం చేసి నడివయస్సులో ముసలితనాన్ని మీదబెట్టి రుద్దుతాం దని —జాతినంతటినీ నిర్వీర్యం చేసేస్తాం దని మనం అందరమూ అసమ్మతి తెలుపుతున్నాం. ఆగ్రహాన్ని ప్రకటిస్తున్నాం. నిందిస్తున్నాం. ఖండిస్తున్నాం. ప్రతీకారం చెయ్యా లని వూహిస్తున్నాం. ఇందులో పత్రికా సంపాదకుల చెయ్యి యెక్కువగా వుంది. అలాంటి సంపాదకులు ప్రజలకందరికీ అందుబాటులో లేని భాషలో తమ వ్యాఖ్యానాలు రాసి ప్రకటించడం యేం ధర్మమూ?

వాస్తవంగా రామమూర్తిపంతులుగారు వినిపించిన యీ దివ్యసందేశం కోట్లు వెలచేస్తుంది. పైగా యిది తెనుగు పత్రికల విజయానికి కీలకంగా వుంది.

అత్యవసరమైన యీ విషయం యిప్పటికే పరిష్కరించబడి వుండవలసింది. అయినా యిప్పుడేనా దీన్ని గురించి శ్రద్ధ చెయ్యడం చాలా అవసరం.

ఇప్పటి తెనుగు పత్రికల సంపాదకుల పరమావధి మానవసేవ గాని ధనార్జన కాదు; కనక వారంతా పంతులుగారి సందేశాన్ని మననం చేసుకుంటూ, అనుసరిస్తూ కృతకృత్యు లవుతా రని నమ్ముతున్నాం.

సింహానాదం

ఇప్పుడు వచ్చిన ఆపత్తిదీ.

వొక పెద్ద తెనుగు గడ్డని విరుచుకుపోవడానికి ఓఢ్రులు దృఢదీక్ష వహించి వున్నారు.

వొక్క గంజా మాంధ్రులకు తప్ప తతిమ్మా పది జిల్లాలవారికీ యిది చీమ కుట్టినట్లేనా తోచడం లేదు.

ఇలాంటి స్థితిలో వేంకటగిరి కుమారరాజాగారూ కిర్లంపూడి జమీందారుగారూ డాక్టరు సుబ్బరాయనుగారితోటీ మరి కొందరితోటీ కలిసి గవర్నరుగారి దగ్గిరికి రాయబారం వెళ్ళి "పర్లాకిమిడి తాలూకాలో కొంతభాగం ఒరిస్సారాష్ట్రంలో కలపవచ్చు" నని సిఫారసు చేసి చక్కావచ్చారు.

ఇం కేమిటీ చెయ్యడం? ఆంధ్రరాష్ట్రం ఏర్పడకపోతే పోయింది. యిప్పుడున్నంత మట్టు కేనా మనం మంతా కలిసివుండడం పడుతుందా పట్టదా?

వెనక దొరతనంవారు బంగాళాదేశాన్ని విడదీశా రంటే బంగాళీలకి రెండు రాష్ట్రా లేర్పడ్డాయి; గాని యిప్పుడు మనకు వచ్చిన విభజన అలాంటిది కాదు. ఇది శాశ్వతంగా, బలవంతంగా కొన్ని లక్షల ఆంధ్రులు దత్తుపోవడమే.

వెనక యెప్పుడో మనవాళ్లు సామ్రాజ్యాలు నిరించారుట. దక్షిణదేశం అంతా యేలేరుట. తుదకి మగధదేశం కూడా జయించారుట; కాని యిప్పుడు మనం వున్నంత అపస్మారస్థితిలో మరెవరూ యెప్పుడూ వుండరు.

ఇల్లాంటి పరిస్థితుల్లో మనం రాజకీయాందోళనంలో మునిగిపోయి వున్నా మంటే యేమేనా అర్థం వుందా?

నీట ముంచడాని కేనా, పాల ముంచడాని కేనా మనకి సమర్థు డైన నాయకు డేడీ? మనకి జాతీయాభిమానం యేదీ? ఆత్మగౌరవం యేదీ?

బంగాళీలను నిలువునా చీల్చేశాడని కర్జను ప్రభువుమీద కోరాలూ మిరియాలూ నూరిన ఆంధ్రుల మేనా మనం?

ఖిలాఫత్తుకు అక్రమం చేసిం దని బ్రిటిషు ప్రభుత్వాన్ని నిందించిన ఆంధ్రుల మేనా మనం?

బార్డోలీ రైతులు కోరి తెచ్చుకున్న ఆపతుకు ప్రతీకారం చెయ్యడానికి కైదుకొట్లు నింపేసిన ఆంధ్రుల మేనా మనం?

లేకపోతే, గంజామాంధ్రభూభాగాన్ని ఒరిస్సాలో కలపడానికి వల్లకా దని తీవ్రమైన ఆందోళనం సాగిస్తూ వున్న వారు మన ఆంధ్రులు కారా?

* * * *

పర్లాకిమిడిరాజాగారికనుకూలంగా రాయబారం వెళ్లిన మన రాజులు మాత్రం యేమాలోచించారూ? పర్లాకిమిడిరాజాగారు తమను తోటి సభ్యులా? సహచరునికి సాయం చెయ్యడం తమకి ధర్మమా? అయితే ఆంధ్రులు తమ కేమవుతారు? ఆంధ్ర దేశంతో తమ కెలాంటి అనుబంధం వుంది?

తమ తోటి సభ్యుల జాతికి చెందిన ప్రదేశాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించడం తప్పని, ద్రోహమని, అసహ్య మని ఆ పర్లాకిమిడిరాజాగారాలోచించరేం? కొంచెం మేనా జంకరేం?

వారు తా మెలాగేనా ఒరిస్సారాష్ట్రంలో చేరా లని చూస్తున్నట్టే వీరు తమ జాతివారి నెలాగేనా తమతోటే వుంచుకోవా లని చూడరేం?

* * * *

ఎలాంటి జాతికి ఎలాంటి రాట్లు వచ్చాయీ? ఎలాంటి ప్రతిభ యెంత మందగించి యెంత కలుషితం అయిపోయిందీ?

ఇప్పుడు మనం ఓఢ్రులతో డీకొనగలమా లేమా అనే విషయం వేరు. వారిని ప్రతిఘటించడమూ మానడమూ అనే విషయం కూడా వేరే.

“మనం యెవళ్లం? ఆంధ్రదేశం అంటే యెక్కణ్ణుంచి యెక్కడికి? ఆంధ్రు లంటే యెవ రెవరు?”

మన మిప్పుడు ప్రాతిపదికదగ్గిరికి పోవాలి. తరాలకి తరాలు, శతాబ్దులికి శతాబ్దులు అఖండవైభవం అనుభవించిన మన పూర్వుల అభిమానమూ పట్టుదలా, ధైర్యసహసాలా యెలాంటివో తెలుసుని మనం వాట్ల నిప్పుడు ఆవాహన చేసుకోవాలి.

తరుణ ఆంధ్రమా! మేలుకో. ఇరుగు పొరుగుల వారు నిన్ను చూసి నవ్వుతున్నారు. నిన్ను భావదాస్యంలో ముంచేస్తున్నారు. నిన్ను తమ ఉన్నతిసౌధానికి సోపానపరంపరగా ఉపయోగించు కుంటూన్నారు. లే. నీ అభిజాత్యాన్ని ప్రకటించుకో. నీ సంప్రదాయాన్ని వెల్లడించుకో. ఆంధ్రు డంటే కోదమసింగ మని బోధపడేటట్టు సింహనాదం చెయ్యి.

ఆత్మబలం యెరగని సలహా

౧౯౩౩ జూన్ ౨౨వ తేదీని బెజవాడలో వొక బాల్యవివాహం జరిగింది. వధువు యెనిమి దేళ్ల పసిబిడ్డ. వరుడు పదిహేనేళ్ల పిల్లాడు. ఈ సందర్భంలో వొక పెద్దమనిషి కేసు పెట్టడమూ, కృష్ణా జిల్లా మాజస్ట్రేటు వియ్యంకుల కిద్దరికీ యేడేసి వందలూ, వియ్యపురాళ్ల కిద్దరికీ నూరేసీ, పురోహితుల కిద్దరికీ మూడేసి వందలూ మొత్తం ౨౨ వందల రూపాయలు జరిమానా విధించడమూ సక్రమంగా జరిగిపోయాయి.

దీనిమీద వ్యాఖ్యానం చేస్తూ (౨౫-౩-౩౪) ధర్మసాధని యిలా అంది.

“.........ఈ జరిమానాలు మొదట కనిపించినను వివాహవిషయమున వధూవరుల కుండ దగు స్వయంనిర్ణయాధికారమును పాటింపక అభమూ శుభ మెరుగని పసిపిల్లలపై సంసారభారమును మోపిన మహా నేరమునుబట్టి చూచిన నవి యెంత మాత్రమును యెక్కువ యనిపింపవు. బాల్యవివాహ నిరోధశాసన మున్నను అది నేడు దాదాపుగ నామమాత్రమే యై యున్నది కొద్ది జరిమానాలకు జనులు లక్ష్య పెట్టుట లేదు. బందరు జిల్లా మాజస్ట్రేటు మార్గము ననుసరించి యితరమాజస్ట్రేటులు గూడ హెచ్చు జరిమానాలను విధించినచో బాల్యవివాహముల సంఖ్య త్వరగా తగ్గిపోగలదు”

నిజంగా, యిలాంటి బాల్యవివాహాలను మే మే సందర్భంలోనూ అంగీకరించలేము. అలాగే సనాతనధర్మవాదుల అనేకకృత్యాలను సమర్థించడాని కూడా మేము సాహసించలేము; కాని యీ వ్యాఖ్యానంలో ధర్మసాధని చూపించిన తర్కం మాత్రం చాలా అసహ్యంగా వుంది.

హిందూ సంఘంలో బాల్య వివాహాచారం వొక్కటే కాదు, మాన్పించవలసిన దురాచారాలింకా అనేకా లున్నాయి. వాటి నన్నిటినీ సంస్క

రించి జాతిని మళ్లీ నిర్మిస్తే గాని మనకి స్థిర మైన మోక్షం లేదు. అయితే ఈ పునర్నిర్మాణం సాంఘికంగా జరగవలసిందే; కాని శాసనాల ఆధారం వల్ల జరగరాదు. ఏమంటే? ఇప్పటి శాసనసభ్యులలో అనేకులకు సాంఘికశాసనాలను సభలో ప్రవేశపెట్టడానికి గాని, సమర్థించడానికి గాని చివరికి వోటు చెయ్యడానికి గాని అర్హత లేదు. అంచేతనే యీ బాల్యవివాహనిరోధశాసనం జల్లెడలాగ ఛిద్రబహుళమై, ఇటు సంస్కారపక్షంవారికీ, అటు సనాతనధర్మపరాయణులకూ గూడా అసంతృప్తికరమై, తనకి తానే అగౌరవకరంగా తయారయింది. ఇట్టి శాసనాలను ప్రజలమీద ప్రయోగించడం చాలా అపాయకర మైన విషయం.

ప్రౌఢావివాహాలను వ్యాప్తిలోకి తేవడమే ధర్మసాధని వుద్దేశ మని మాకు తెలుసు. ఈవుద్దేశం చాలా న్యాయధర్మసమ్మత మనీ, తెనుగు దేశంలో గార్హస్థ్యం ప్రేమభరితమై వుండా లన్నా, ధర్మసమ్మతమై వుండా లన్నా, సర్వవిధాలా బలిష్ఠ మైన భవిష్యత్పౌరజాతిని నిర్మించడానికి తాహత్తు కలదై వుండా లన్నా యుక్తవయుస్సు వచ్చిన వధూవరుల యిష్టం మీదే వివాహాలు జరిగే ఆచారం ప్రారంభం కావా లనీ మేము చెప్పగలం. కాని ప్రజలలో బాల్యవివాహాచారాన్ని తగ్గించడానికి యిలాగ సహింపరాని జరిమానాలను విధించవలసిం దనీ అధికారులను ప్రోత్సహించడం బాధ్యత యెరిగిన సలహాలలో చేరదు.

కఠినకారాగారశిక్షలు విధించీ, భరింపరాని జరిమానాలను విధించీ సర్కారు, మన కిప్పటిస్థితిలో వినాశకర మైన శాసనోల్లంఘనోద్యమాన్ని అణచివెయ్యగలిగినట్లే యిలాగ బరువైన జరిమానాలను విధించి బాల్యవివాహాచారాన్ని గూడా అణచివెయ్యవచ్చు; కాని దీనివల్ల సంఘంలో కల్లోలాలు పుడతాయి. కక్షలు పెరుగుతాయి. సనాతనధర్మపరాయణులకు నోరు లేదు గాని సంఖ్య అధికంగానే వుంది. వారంతా సరియైన కట్టుబాటుతో ప్రచార్యం సాగించా రంటే రాజకీయంగా యేపక్షానికి చెందినా శాసనసభలో మెజారిటీ సంపాదించి యిలాంటి శాసనాలను రద్దు చేయించగలరు. కొత్త వాటికి ప్రవేశం లేకుండా చెయ్యగలరు. ఇంతకీ: సంస్కారపక్షంవారిలో గూడా వొక దారీ తెన్నూ లేదు. ఆత్మవిశ్వాసం లేదు. దృఢదీక్ష లేదు. ఏకాగ్రత లేదు. తరిఫీయతు కూడా యేమీ లేదు. సౌమ్యపద్ధతులను ప్రయోగించి అపజయం దాకా యెందుకూ, వారందులో తమ శక్తి నంతా వినియోగించి కూడా చూడ లేదు. వారు ప్రజలలో యేవిధ మైన ప్రచారమూ సరిగా చెయ్యలేదు. ఈ స్థితిలో మొట్టమొదటే వారిలాంటి శాసనాలను నిర్మించి త్వొందర త్వొందరగా తామసప్రవృత్తితో ప్రయోగించవలసిం దని సలహా చెప్పడం శోచనీయంగా వుంది.

అనేకసన్నివేశాలను పురస్కరించుకుని ఇవాళ మన సంఘం అంతా గజగజలాడిపోయివుంది. ఏశాసనమూ లేకుండానే అమానుషా లైన చాలా కట్లుబాట్లు సడలిపోతున్నాయి. వితంతువివాహాలు సామాన్య లయిపోయాయి. సముద్రయానం అలవాటయిపోయింది. రజస్వలావివాహాలూ, శాఖాంతరవివాహాలూ, వర్ణాంతరవివాహాలూ—మతాంతరవివాహాలూ గూడా జరుగుతూ చెల్లిపోతున్నాయి ఇంకా యెన్నో మంచి మంచి ఆచారాలు జరుగుతున్నాయి. ఇలాగ సంఘం అంతా సంస్కరణపరాయణులకు అనుకూలంగా వుంది. ఈసందర్భంలో వారు తగిన దీక్షతో, దృఢ మైన పట్టుదలతో ప్రచారం ప్రారంభించా రంటే ఆశ్చర్యకరా లయిన ఫలితాలు కలుగుతాయి. ఇపుడు సంస్కర్తలు చెయ్యవలసిన పని అభిమానంతోటీ, అనుకంపతోటీ, ప్రేమతోటీ, ఓపికతోటీ ఉపదేశమూ, బోధా చెయ్యడం గాని ఆత్మబలం యెరగని యిలాంటి సలహాలు కావు.

ఆంధ్రులు— హిందీ

ఈ ఫిబ్రవరి ప్రబుద్ధాంధ్ర పత్రికలో "ఆంధ్రులు ఆంధ్రము" అను వ్యాసమున శ్రీ భా. వెం. కృష్ణారావుగారు ఆంధ్రోద్యమము అందు ముఖ్యముగా ఆంధ్రభాషాభివృద్ధి విషయమున మనవారు అశ్రద్ధ వహించుచున్న సంగతి వివరించి, ఇకముందైనను ప్రమత్తతను విడనాడి కార్యశూరులు కావలెనని చక్కగా నుద్బోధించిరి. కాని యీ సందర్భమున ఆంధ్రుడు హిందీభాషను వ్యాపింపజేయ యత్నించుట నిజముగా పరమమూర్ఖుడగుచున్నాడనియు ఇంగ్లీషుకువలె హిందీకిని బానిస యగుచున్నాడని వ్రాసి, హిందీప్రచారముచే ఆంధ్రభాషాభివృద్ధికి హాని కలుగుచున్నట్టు లభిప్రాయమును దెల్పిరి. మనవారు ఆంధ్రభాషాజ్ఞానమునకై కృషి చేయక కేవలము హిందీప్రచారమునకే ప్రయత్నించుచో అందుచే స్వభాషకు నష్టము కలుగుట నిజమే; కాని హిందీప్రచారకుల భావ మది కాదు. మన స్వభాషలందు కృషి చేసుకొనుచునే వీలైనంత వరకు హిందీని జాతీయభాషగా వ్యాపింపజేయవలెననియే హిందీప్రచారకుల యుద్దేశ్యము. దేశాభిమానులు, తమ తమ ప్రాంతమం దభిమానమును, ప్రాంతాభిమానులు దేశాభిమానమును విడనాడ నవసరము లేదు. ఇట్లే జాతీయభాషాభిమానమును, స్వభాషాభిమానమునకు భంగకరము కాగూడదు. సామాన్యభాష యనగ మన ప్రాంతీయభాషను నశింపజేయున దను భావము తప్పు. ఇతరరాష్ట్రముల వారితో కలిసి వ్యవహరించుటకును, వ్యాపారాదుల యభివృద్ధికిని, జాతీయతాభివృద్ధికిని సామాన్యభాష అవసరము. యూరపుఖండమున స్వతంత్రరాజ్యపు ప్రజలు కూడ సామాన్యభాషావశ్యకతను గమనించి ఇంగ్లీషు జర్మను మొదలగు వారిలో చాలామంది జనులు ఫ్రెంచిభాషను నేర్చుకొనిరి. అందుచేతనే సామాన్యభాష యనుటకు "Lingua Franca" అని వాడుక వచ్చినది. అట్టి స్థితిలో ఏకదేశీయులమగు మనలో సామాన్యభాష లేకుండుట అనేక అనర్థములకు కారణముగా నున్నది. మఱియు వాఙ్మయజ్ఞానాభివృద్ధికి గూడ సామాన్యభాష అవసరము. మన దేశభాష లగు బంగాళీ, హిందీ, మరాఠీ, గుజరాతీ, అరవము మొద లగు వానిలో అనేక ఉద్గ్రంథములును పత్రికావ్యాసములును మన దేశీయులచే వ్రాయబడుచున్నవి. వానిలో చాల కొద్దిగ మాత్రమే ఇంగ్లీషుభాషలోనికి తర్జుమా యగుచున్నవి. మన దేశీయుల ఉద్గ్రంథములు యిటీవల సామాన్యభాష యగు హిందీలోని కనువదింపబడుచున్నవి. ఇప్పుడు స్వభాషకు తోడు హిందీ కూడ నేర్చుకొని మన దేశభాష లన్నిటిలోని మంచి గ్రంథముల సారమును గ్రోలగలుగుదుము. మఱియు వీలైనంత వరకు హిందీలోని ఉద్గ్రంథములను పత్రికావ్యాసములను మన స్వభాషలోని కనువదించి స్వభాషావాఙ్మయమును గూడ వృద్ధిచేసుకొనవచ్చును. హిందీప్రచార మారంభించిన తరువాత హిందీలో నుండి కొన్ని మంచి గ్రంథము లాంధ్రీకరింపబడినవి. జాతీయభావవ్యాప్తి మొదలగు కారణములచే హిందీవాఙ్మయ మిటీవల నతివేగముగా వృద్ధి గాంచుచున్నది. అందువలన ముందు హిందీవాఙ్మయసహాయమున మన వాఙ్మయమును వృద్ధి నొందవచ్చును. మన ఆంధ్రములోని గ్రంథములకును పత్రికలకును తగు ద్రవ్యసహాయమును లేఖకసహాయమును లేకపోవుటకు మనలోని ద్రవ్యాధికులకును విద్యాధికులకును దేశీయవాఙ్మయమునం దభిరుచి లేక ఈ ఆర్థికదుస్థితిలో గూడ కేవలవినోదములతో కాలక్షేప మగుటయే ముఖ్యకారణము. హిందీ అభిమానులు సాధారణముగా ఆంధ్రమందును అభిమానము కలిగియే యున్నారు. వారిలో చాలమంది అనిపరులు కారు. ముఖ్యముగా శ్రీమంతులును ఆంగ్లవిద్యాధికులును సాధారణముగా వాఙ్మయమునకు ప్రోత్సాహ మొసగకున్నారు. ఆంధ్రసాహిత్యాభిమానులలో గూడ చాలమంది గ్రాంథిక వ్యావహారిక శైలిని గూర్చి యతివాదవివాదములలోను "నన్న

య వైదీకియూ నియోగియూ" మొదలగు ప్రస్తుతో
పకారులు కాని విషయములలో కేవలవినోదకథల
లోను చాల వరకు తమ శక్తులను వృథపరుచుచు
న్నారు. భాషాభివృద్ధికి లేఖకులును పాఠకులును
విశాలహృదయులు సంఘోపకారభావపూరితులుగ
నుండుట యావశ్యకము. లేనిచో వాఙ్మయమునకు
నిజమగు అభివృద్ధి లేకపోవుటయే గాక అట్టి గ్రం
థములకు పత్రికలకు జనాదరము కూడ తగ్గుట సహ
జము. పాఠకులకు సద్విషయములం దభిరుచి గల్గిం
చుటకు గూడ లేఖకులు వీలైనంత వరకు యత్నించ
వలెను. ఈ సంగతి చాలమంది గమనింపక పోవుట
చే మన వాఙ్మయము సంకుచిత మగుచున్నది. ఇంగ్లీ
షునకు వలె హిందీకిని ఆంధ్రులు బానిస లగుచు
న్నా రనియు, ఇది ముందు మన ఊపిరాడకుండ
జేయు ననియు కూడ శ్రీకృష్ణారావుగారు తమ వ్యా
సమున సూచించిరి. ఈసందర్భమున ఇంగ్లీషునకును
హిందీకిని గల భేదము గమనించుట అవసరము.
ఇంగ్లీషు పరభాష. ప్రస్తుత మున్న రాజకీయపరాధీ
నత తప్పినచో ఇంగ్లీషుతో మన దేశపు జనసామా
న్యమునకు జోక్య ముండదు. ఇంగ్లీషువారి నాగర
కత మనదానికి వ్యతిరిక్తము. మఱియు దాని అక్షర,
శబ్ద, వాక్యముల రచనాదులే గాక ఆభాషయందలి
భావముల పద్ధతి కూడ మన ఆంధ్రభాషపద్ధతికి కేవ
లము వ్యతిరిక్తము. కాని మన దేశభాషలకు చాల
వరకు పరస్పరసంబంధము కలదు. హిందీ యిదివ
రలోనే కోట్లకొలది మన దేశీయులకు స్వభాష
యగుటయే గాక చాలవరకు ఇతరప్రాంతీయులకు
గూడ తెలిసిన భాష. హిందీ, హిందూస్థానీ తెలి
సిన మార్వారీలు, బొందిలీలు, మహమ్మదీయులు
మొదలగు వారు మన ఆంధ్రదేశమునందు గూడ ఇది
వరకే చాలకాలమునుండి వ్యాపించి యున్నారు.
మఱియు ఆంధ్రదేశము చిరకాలము మహమ్మదీయ
పరిపాలనక్రింద నుండుటచేతను, ఇప్పటికిని నిజాం
రాజ్యమందలి షుమారు 80 లక్షలమంది ఆంధ్రులు
హిందూస్థానీనే అన్ని లౌకికవ్యవహారములకును తప్ప
క వాడుచు, స్వభాష యగు ఆంధ్రమున గూడ
చాలవరకు హిందూస్థానీపదములనే వాడుచుండుట
చేతను, వారితో వీడని సంపర్కము గల మన వా
డుకభాషలో కూడ అర్జీ అసల్, కసరత్, కిమత్,
కిరానా, కిస్తీ, ఖాతా, ఖులాసా, గస్తీ, గల్లీ, చం
దా, చంచా, మామూల్, జరూరు మొదలగు వం
దల కొలది హిందీ హిందూస్థానీ పదములు ఇదివర
కే ఆంధ్రపదములుగా వాడబడుచున్నవి. మఱియు
ఆంధ్రము ప్రథమమున ద్రావిడకుటుంబపు దైనను,
మన వాఙ్మయప్రారంభమునుండియు సంస్కృతభా
షామూలముగను ఆర్యనాగరికతద్వారాను వృద్ధి
నొందుటచేతను అరవవారిలో వలె గాక ఆంధ్రు
లలో ఆర్యరక్త మధికముగ నుండుటచేతను సం
స్కృతప్రాకృతపరిణామ రూపమును ఆర్యావర్తీ
యుల ముఖ్యభాషయు నగు హిందీకిని ఆంధ్రము
నకును శబ్దజాలపు వాడుకలోను భాషావిషయము
నను వాఙ్మయవిషయముననను చాల సామీప్యము
కలదు. మఱియు ఆర్యావర్తము వారికి మనకు ఒకే
నాగరకత యగుటచే ఇంగ్లీషు సంపర్కము వలన
కలుగు భావదాస్యము హిందీసంపర్కమువలన కలు
గదు. మఱియు ఇంగ్లీషువలె గాక హిందీ నేర్చు
కొనుటకు విశేషవ్యయప్రయాసలు అక్కర లేదు.
అందుచే దానిని స్త్రీలును పల్లెటూళ్లలోని జనులును
సులభముగ నేర్చుకొనుచున్నారు. అమెరికాసం
యుక్తదేశము, స్విట్జర్లండు, రష్యా మొదలగు కొన్ని
దేశములలో గూడ మన దేశమందువలెనే ఆయా
భాగములందు వేరువేరు ప్రాంతీయభాషలు వాడు
కలో నున్నవి. వాటికిని ప్రత్యేకవాఙ్మయము లు
న్నవి. అయినను జాతీయసౌకర్యముల నిమిత్తమై
ప్రాంతీయభాషల వారు తమ స్వభాషలను తమ
ప్రత్యేకవాఙ్మయమును విడనాడకయే సామాన్య
భాషను నేర్చుకొని అందలి వాఙ్మయపు లాభమును
గూడ పొందుచున్నారు. మన దేశపరిస్థితిని బట్టి
మనమును అట్లే జరిగించుట యుక్తముగా కనపడు
చున్నది.

కొమాండూరి శఠకోపాచార్యులు.